కలెక్టరేట్‌లో అక్షరాస్యత దినోత్సవం

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జేసీ రాహుల్‌మీనా సంపూర్ణ అక్షరాస్యత ప్రతిజ్ఞ చేయించారు. తమ చుట్టూ ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతామని జిల్లాఅధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ జిల్లా నోడల్ అధికారి పోషయ్య, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, మెప్మా పీడీ ప్రియంవద, డీసీహెచ్‌ఎస్ లావణ్యకుమారిపాల్గొన్నారు.

పంట నష్టాల గణనలో అధికారులు నిమగ్నం

» రెండురోజుల్లో కలెక్టర్‌కు నివేదిక

కలెక్టరేట్(కాకినాడ),సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): గతనెలలో కురిసిన భారీవర్షాలవల్ల రైతన్న తీవ్రంగా నష్టపోయాడు. వరితోపాటు ఇతర పంటలకు కూడా నష్టం కలిగింది. ఈ నేపథ్యంలో పంటనష్టాల గణనలో అధికారు లు బిజీగా ఉన్నారు. జిల్లాలో గతనెల 18, 19, 20 తేదీల్లో భారీవర్షాలు కురిశాయి. దీనివల్ల జిల్లాలో 3,200 హెక్టార్ల పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. రోజుల తరబడి పంటపొలాల్లో నీరు నిలిచిపోవడంవల్ల వరినాట్లు కుళ్లిపోయి రైతన్న తీవ్రంగా నష్టపోయాడు. జిల్లాలో గొల్లప్రోలు,పిఠాపురం,యు.కొత్తపల్లి, సామర్లకోట, జగ్గంపేట, తాళ్లరేవు, పెద్దాపురం వంటి మండలాల్లో నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో పదిరోజులుగా జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో బృందాలు పంటనష్టం గణన క్రతువును నిర్వహిస్తున్నాయి. బృందాల్లో వ్యవసాయశాఖ అధికారులతోపాటు ఎంపీడీవోలు, పోలీసు, రెవెన్యూ అధికారులు ఉన్నారు. పంట నష్టాల గణన ప్రక్రియ మరో రెండురోజుల్లో పూర్తిచేసి నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నారు. అనంతరం ఆ నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నారు. ఆ తర్వాత పంట నష్టపరిహారం విడుదలవుతుందని అధికారులు అంటున్నారు.

వీడిన గ్రహణం

తెరుచుకున్న ఆలయాలు

» చంద్రగ్రహణం అనంతరం సంప్రోక్షణ చేసి ఆలయాలను తెరిచిన అర్చకులు

» స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు

6



ఐటీ ఇంక్యుబేషన్ టవర్ అలంకారప్రాయంగానే..

» కాకినాడ రూరల్ మండలం సర్పవరం ఐటీ సెజ్‌లో నిరుపయోగంగా ఇంక్యుబేషన్ టవర్

» రూ.7.5కోట్లు వెచ్చించి నిర్మించినా నిరుద్యోగులకు దక్కని ఉపాధి

» పదేళ్లుగా ఇదే పరిస్థితి

» చోద్యం చూస్తున్న అధికారులు

సర్పవరంజంక్షన్, సెప్టెంబరు 8(ఆంధ్ర జ్యోతి): నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన కోసం సీఎం చంద్రబాబు ఏర్పాటుచేసిన ఐటీ ఇంక్యుబేషన్ టవర్ దశాబ్దంగా అలంకారప్రాయంగా మారింది. రూ.7.50కోట్ల నిధులతో సువిశాల భవనంలో కార్పొరేట్ ఐటీ కంపెనీలకు దీటుగా సర్పవరం ఐటీ సెజ్‌లో నిర్మించిన ఇంక్యుబేషన్ టవర్ నిరుపయోగంగా మారింది. ఇక్కడ ఐటీ సెంటర్ ఉందన్న విషయం ఇటు అధికారులకు, అటు ప్రజాప్రతినిధులకు తెలిసిన దాఖలాలు లేకపోవడం గమనార్హం. స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సాహం లేక, నిర్వహణ లేకపోవడంతో ఈ టవర్ శిథిలావస్థకు చేరింది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు సీఎం చంద్రబాబు ఈ సెంటర్‌ని సద్వినియోగం చేయాల్సిందిగా జిల్లా ప్రజలు కోరుతున్నారు.

దశాబ్దకాలంగా నిరుపయోగంగా..

కాకినాడజిల్లా కాకినాడ రూరల్ మండలం సర్పవరం ఆటోనగర్ ఐటీ సెజ్‌లో రూ.7.50 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అప్పటి టీడీపీ ప్రభుత్వం 2015, డిసెంబర్ 30న ఐటీ ఇంక్యుబేషన్ టవర్‌ను ప్రారంభించింది. ఇంజనీరింగ్‌లో పట్టభద్రులైన నిరుద్యోగుల విభిన్న ప్రయోగాత్మక ఆలోచనాశక్తి, సృజనాత్మకతను వెలికితీసి సాఫ్ట్‌వేర్ స్కిల్స్‌ని పెంచేందుకు వీలుగా 50సెంట్ల స్థలంలో ఐటీ ఇంక్యుబేషన్ టవర్‌ని ఏర్పాటుచేశారు. ఇక్కడ 2వేలమంది ఉద్యోగులు పనిచేసేందుకు వీలుగా కార్పొరేట్ స్థాయిలో పలు బ్లాకులు నిర్మించారు. ఇంక్యుబేషన్ టవర్‌లో ఉద్యోగాలకోసం కేఐటీ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్, కేవై టీఈఎస్, ఇన్‌టెన్సివ్ టెక్నాలజీస్ సంస్థల ప్రతినిధులతో అప్పటి ఏపీ ఐటీ సెక్రటరీ బిశ్రీధర్, ఐటీ మంత్రి రఘునాథరెడ్డి, హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సమక్షంలో ఎంవోయూ కుదుర్చుకున్నారు. అప్పట్లో మూడు ఐటీ కంపెనీలతో ఎంఓయూ జరగ్గా అధికారుల నిర్లక్ష్య వైఖరి, అవగాహన లోపంతో ఇతర కంపెనీలు రాలేదు. 2019 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఈ ఐటీ టవర్ వైపు కన్నెత్తి చూడకపోవడంతో ఏళ్ల తరబడి నిరుపయోగంగా మారింది. చిన్నచిన్న కంపెనీలు వచ్చినా వాటికి ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం కొరవడడంతో ఎందుకూ పనికిరాని విధంగా తయారైంది. ఇంక్యుబేషన్ టవర్‌లోకి స్టార్టప్, ఐటీ కంపెనీలు వచ్చేలా ప్రభుత్వం తరపునుంచి సరైన ప్రోత్సాహం లేకపోవడంతో ఇంక్యుబేషన్‌టవర్ ఎందుకూ పనికిరాకుండా పోయిందని నిరుద్యోగులు ఆందోళనవ్యక్తం చేశారు. దీంతోపాటు విశాఖలో ప్రారంభించిన ఐటీ ఇంక్యుబేషన్ టవర్‌లో వేలాదిమందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. ఇక్కడమాత్రం పదేళ్లు దాటుతున్నా ఒక్కరికీ ఉద్యోగఅవకాశాలు కల్పించకపోవడం గమనార్హం. పక్కనే కూతవేటు దూరంలోఉన్న ప్రైవేట్ ఐటీ కంపెనీకి చెందిన కయింట్(సీవైఐఈఎన్‌టీ) వేలాదిమందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. ఐటీ రంగానికి పెద్దపీట వేసే సీఎం చంద్రబాబు ఇక్కడ ఇంక్యుబేషన్ సెంటర్‌పై ప్రత్యేక దృష్టిసారించి పలు స్టార్టప్ కంపెనీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సాహం

-పంతం నానాజీ, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే

టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.7.50 కోట్లతో ఏర్పాటుచేసిన ఐటీ ఇంక్యుబేషన్ టవర్‌ని సద్వినియోగం చేసుకుంటాం. ఐటీ కంపెనీలకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు ప్రోత్సాహం అందిస్తున్నారు. స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సాహం అందించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటా. ఈసెంటర్ ఎందుకు నిరుపయోగంగా ఉందో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుంటారు. వైసీపీ హయాంలో అన్ని రంగాలతోపాటు ఐటీరంగాన్ని నిర్వీర్యం చేశారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి స్వయంగా ఇంక్యుబేషన్ టవర్‌ని సందర్శిస్తాం. జిల్లా ప్రధాన కేంద్రానికి సమీపంలో ఉన్న ఈ సెంటర్ అభివృద్ధితోపాటు ఐటీ కంపెనీలు ఇక్కడకు తరలివచ్చి కార్యకలాపాలు నిర్వహించేలా ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారాన్ని అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తా.

బార్లా తెరిచినా!



నో చీర్స్

బార్ల దరఖాస్తులకు వెనుకంజ

(కాకినాడ/రాజమహేంద్రవరం,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో బార్ల లైసెన్సులకు దరఖాస్తులు రప్పించడం కోసం ఎక్సైజ్‌శాఖ తంటాలు పడుతోంది. తొలిసారి పిలిచిన బార్లకు స్పందన రాకపోవడంతో రెండోసారైనా ఫలితం వచ్చేలా చేయడానికి తెగ ప్రయత్నిస్తోంది. ఉన్నతాధికారుల ఒత్తిళ్లు ఎక్కువగా ఉండడంతో ఎలాగైనా పని పూర్తయ్యేలా చేయడం కోసం తమ అధికారాలకు సైతం పదును పెడుతున్నారు. కొందరు మద్యం వ్యాపారులకు కబుర్లు పంపి బార్లను దక్కించుకోవాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. సిండికేట్లతో మాట్లాడుకుని అయినా నలుగురూ కలిపి ముందుకు రావాలంటూ ఆదేశాలిస్తున్నారు. లేదంటే ఎమ్మార్పీ ఉల్లంఘనలు, బెల్ట్ కేసులు తప్పవంటూ పరోక్ష హెచ్చరికలు చేస్తున్నారు. పాత బార్ల నిర్వాహకులను పిలిచి సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు.బార్లను దక్కించుకుంటే సహకరిస్తామని భరోసా ఇస్తున్నారు. ఇంత చేసినా ఈ నెల 14 నాటికి అనుకున్న ఫలితం వస్తుందో రాదోనన్న బెంగ వీరిని వేధిస్తోంది.



అధికారుల ఒత్తిడి..

ఎలాగైనా అన్ని బార్లకు నాలుగేసి చొప్పున దరఖాస్తులు పడేలా చేయడానికి రకరకాల వ్యూహాలు అమలు చేస్తున్నారు. చాలా మంది తమకు ఆసక్తి లేదని అధికారులకు తెగేసి చెప్పేస్తున్నారు. ఇప్పటికే మద్యం దుకాణాలతో రాబడి లేక ఇబ్బంది పడుతున్నామని, ఒక్కో దరఖాస్తుకు రూ.5లక్షల నాన్‌రిఫండబుల్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేయలేమని చెబుతున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులు రెండోసారి డ్రా సమయానికి దరఖాస్తులు వచ్చేలా కనిపించకపోవడంతో ఎక్సయిజ్ అధికారులు పరోక్ష హెచ్చరికలకు దిగుతున్నారు. దీంతో కొందరు వ్యాపారులు దారికి వస్తుండగా.. మరికొందరు ఏం చేయలేమని తెగేసి చెప్పేస్తున్నారు. ప్రధానంగా కాకినాడ, రాజమండ్రి, అమలాపురం ప్రాంతాల్లో బార్ లైసెన్స్ ఫీజులు భారీగా ఉండడంతో అసలు వ్యాపారులు దరఖాస్తులు చేయడానికి ముందుకు రావడంలేదు.14లోపు అన్ని బార్లకు దరఖాస్తులు వచ్చేలా చేసే బాధ్యత పైఅధికారులు తమకు అప్పగించడంతో ఈపని ఎలా పూర్తి చేయాలో తెలియక ఎక్సయిజ్ అధికారులు తంటాలు పడుతున్నారు.అయితే ఈసారి కూడా వ్యాపారస్తులు సారీ అంటున్నారు. ఈ టార్గెట్ పూర్తిచేయకపోతే ఎక్కడ బదిలీ వేటు పడుతుందోనని కొందరు సీఐలు హడలిపోతున్నారు.మొదటి నోటిఫికేషన్‌కి అధికారుల బెదిరింపులు తట్టుకోలేక కొందరు దరఖాస్తులు సమర్పించారు. కేవలం ఇప్పటి వరకూ వ్యాపారం చేసిన చోటు పోతుందని ప్రస్తుత వ్యాపారస్తులు కొందరు దరఖాస్తులు సమర్పించడానికి సిద్ధం అవుతున్నారు.ఇప్పటికే పాత బార్‌ల వద్ద 16 నుంచి పునఃప్రారంభి స్తామని బోర్డులు పెట్టడం అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. మరో వైపు బార్ వ్యాపారస్తుల్లో అంతర్గతంగా పోటీ ఎక్కువ కావడంతో స్థలం, షాపుల అద్దెలు ఆయా యజమానులు భారీగా పెంచేశారు.

53కి 15 లైసెన్స్‌లు..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కేటాయించిన బార్లకు లైసెన్స్ గడువు ముగియడంతో అధి కారులు ఇటీవల కొత్తగా బార్‌పాలసీ ప్రకటించారు. బార్లకు వేలం విధానం ఎత్తివేసి కొత్తగా లాటరీ విధానం ప్రవేశపెట్టారు. ప్రతి బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తామని నిబంధన విధించారు. ఒక్కో దరఖాస్తుకు రూ.5 లక్షల ఫీజు చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో జనరల్, కల్లుగీత కార్మికులకు కలిపి మొత్తం 53 బార్లకు ఆగస్టు 18న గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఒక్కో బార్‌కు దరఖాస్తు ఫీజు రూ.5 లక్షలు, లైసెన్స్ ఫీజు ఏరియా ఆధారంగా రూ.55 లక్షల వరకు నిర్ణయించారు. 2025 నుంచి 2028 వరకు బార్ లైసెన్స్ కొనసాగుతుందని ప్రకటించారు. వేలం విధానానికి బదులు డ్రా తీసే విధానం అమల్లోకి తేవడంతో భారీ ఎత్తున వ్యాపారుల నుంచి పోటీ ఉంటుందని అధికారులు భావించారు. తీరా మొత్తం వ్యూహం బెడిసికొట్టింది. గత నెల 26 నాటికి దరఖాస్తుల గడువు ముగియగా వచ్చిన అప్లికేషన్లు సున్నా. దీంతో అప్పటికప్పుడు దరఖాస్తుల గడువు ఆగస్టు 29వ తేదీ వరకు పొడిగించారు. తీరా రెండో సారి గడువు ఇచ్చినా దరఖాస్తుదారులు పెద్దగా రాలేదు. దీంతో గత నెల 30న బార్లకు డ్రా తీయగా అధికారులు షాక్ తిన్నారు. కాకినాడ జిల్లాలో మొత్తం 17 బార్లకు నోటిఫికేషన్ ఇస్తే కేవలం ఐదు బార్లకు మాత్రమే నాలుగు చొప్పున దర ఖాస్తులు రాగా వాటిని వ్యాపారులకు కేటాయించారు. కోనసీమ జిల్లాలో 11 బార్లకు నోటిఫికేషన్ జారీ చేయగా ఒక బారుకు మాత్రమే దరఖాస్తులు రావడంతో కేటాయించారు. తూర్పుగోదావరి జిల్లాలో 25 బార్లకు కేవలం 9 బార్లకు మాత్రమే లైసెన్స్‌లు కేటాయించారు. ఒకరకంగా చెప్పాలంటే ఉమ్మడి జిల్లాలో మొత్తం 53 బార్లకు డ్రా తీయాల్సి ఉంటే కేవలం 15 మాత్రమే డ్రా పూర్తి చేసుకున్నాయి.మిగిలిన బార్లకు చేసేదిలేక రద్దు చేశారు.

38 బార్లకూ..రెండో సారీ..!

మిగిలిన 38 బార్లకు తిరిగి డ్రా తీయడం కోసం ఎక్సైజ్ శాఖ ఈ నెల 3న మళ్లీ రెండోసారి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. వ్యాపారులంతా దరఖాస్తులు చేసుకోవాలని కోరింది. ఈ నెల 14న సాయంత్రం 6 గంటల వరకు వ్యాపారులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. కాకినాడ జిల్లాలో 12 బార్లు, కోనసీమ జిల్లాలో 10, తూర్పుగోదావరిలో 16 బార్లకు ఈ నెల 14లోపు దరఖాస్తులు రావాల్సి ఉంది. 15న లాటరీ నిర్వహిస్తారు. తొలి విడత స్పందన లేని నేపథ్యంలో మలివిడత అన్ని బార్లకు దరఖాస్తులు వచ్చేలా చూడాలంటూ ఉన్నతాధికారులు ఎక్సైజ్ అధికారులపై తెగ ఒత్తిడి తెస్తున్నారు.దీంతో ఇప్పుడు జిల్లాల్లో ఎక్సైజ్ అధికారులు తలలుపట్టుకుంటున్నారు.

» ఎక్సయిజ్‌శాఖ నానా తంటాలు

» రెండోసారి బార్ల దరఖాస్తులకు పాట్లు

» మద్యం వ్యాపారులపై అదేపనిగా ఒత్తిళ్లు

» దరఖాస్తులు చేసి తీరాలని మీటింగ్‌లు

» లేదంటే దాడులు తప్పవని హెచ్చరికలు

» 14 వరకు దరఖాస్తు గడువు

» అధికారుల్లో బదిలీ భయం

నేడు ఎక్సయిజ్ శాఖ డీసీ రాక

ఎక్సైజ్ శాఖ డీసీ మంగళవారం కాకినాడ వస్తున్నారు.మూడు జిల్లాల ఎక్సైజ్ అధికారులతో సమావేశం ఏర్పాటుచేశారు. దీనికి అధికారులు సమాయత్తం అవుతుండగా.. తమ గోడు వినిపించుకోడానికి వ్యాపారులు ఎదురు చూస్తున్నారు. మొదటి నోటిఫికేషన్‌కి దరఖాస్తుల విషయంలో కోనసీమ జిల్లా ఎక్సైజ్ అధికారిపై వేటు పడగా, తూర్పు గోదావరి త్రుటిలో తప్పించుకొంది. కాకినాడ కాస్త పర్వాలేదని అనిపించింది. అయితే ఇప్పటికే కొన్ని బార్‌లు కేటాయింపు జరగడంతో నిబంధనల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ మార్పులు ఉండే అవకాశం లేదు. అధికారులు ప్రైవేటు షాపుల దరఖాస్తులదారులకు మెసేజ్‌లు పంపుతున్నా పరిస్థితుల్లో మార్పు కానరావడం లేదు. బార్ పాలసీ వల్ల గతం కంటే మెరుగైన లాభాలు వస్తాయని ప్రభుత్వం చెబుతున్నా.ఆ అంశాన్ని క్షేత్రస్థాయిలోకి ఎక్సయిజ్ అధికారులు తీసుకెళ్లలేకపోతున్నారనే వాదన వినవస్తోంది.

గాలికుంటు వ్యాధి నివారణపై పాడిరైతులకు అవగాహన

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పశువుల్లో వచ్చేగాలికుంటువ్యాధి నివారణకు టీకాలు ఒక్కటే మార్గమని, దీనిపై పాడిరైతులు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం పశుసంవర్థకశాఖ అధికారులతో కలిసి జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటువ్యాధి నిరోధక టీకాలపై గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి వచ్చేనెల 15వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశుసంవర్థకశాఖ జేడీ కృష్ణమూర్తి, డీడీ డీబీఆర్ అంబేడ్కర్, ఏడీ దినకర్, గిరీశ్‌లు పాల్గొన్నారు.

స్మార్ట్‌కార్డుల పంపిణీకి సచివాలయ ఉద్యోగుల సహకారం లేదు

» రేషన్‌డీలర్ల సంఘం జిల్లా ప్రతినిధి

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీలో జిల్లాలో ఉన్న సచివాలయం ఉద్యోగులు సాయం అందించడంలేదని జిల్లా రేషన్‌డీలర్ల సంఘం ప్రతినిధి నల్లా వెంకటేశ్వరరావు అన్నారు. ఈమేరకు సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో జేసీ రాహుల్‌మీనాకు ఆయన వినతిపత్రమిచ్చారు. ఓవైపు రేషన్‌సరుకులు ఇవ్వడం,మరోవైపు స్మార్ట్‌కార్డుల పంపిణీ కష్టసాధ్యంగా మారిందని వెల్లడించారు.రేషన్‌డీలర్లు స్మార్ట్ కార్డుల పంపిణీలో భాగస్వాములవ్వాలని రాష్ట్ర కమిషనర్ ఆదేశాలిచ్చినా సచివాలయ సిబ్బంది పట్టించుకోవడం లేదని జేసీదృష్టికి తీసుకెళ్లారు. అసోసియేషన్ సభ్యులు గాంధీ పాల్గొన్నారు.

పెద్దమల్లాపురం కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలి



కాకినాడ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనులు

» కాకినాడ కలెక్టరేట్ ఎదుట గిరిజనుల ధర్నా

కలెక్టరేట్(కాకినాడ),సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): పెద్దమల్లాపురం కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలని సోమవారం కాకినాడ కలెక్టరేట్ ఎదుట ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోత రామారావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదనలోభాగంగా జిల్లాలోఉన్న సబ్‌ప్లాన్ గిరిజన గ్రామాలైన 59గ్రామాలను కలుపుకుని పెద్దమల్లాపురం కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలన్నారు. దీనికి ఎన్నికల సమయంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారన్నారు. ఆ హామీను అమలు చేసి గిరిజనుల చిరకాల కోరిక నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. గిరిజనులకు రక్షణగా ఉండే చట్టాలైన 1ఫై70, పీఈఎస్ఏ చట్టం, ఆదివాసీల రిజర్వేషన్‌లు సక్రమంగా అమలుకావడంలేదన్నారు.పెద్దమల్లాపురం మండల సాధన కమిటీ నాయకులు ముసలయ్య, బాలరాజు, జర్త సరస్వతి, అప్పలకొండ, గుండు చెంచుబాబు, గంగరాజు మాట్లాడుతూ 40ఏళ్లగా ఇదే డిమాండ్‌కోసం ఉద్యమాలు చేస్తున్నామన్నారు. తాము సబ్‌ప్లాన్ ఏరియాలో ఉండడంవల్ల కుల ధ్రువీకరణ పత్రాలు, ఉద్యోగ అవకాశాలు,వైద్యం పూర్తిస్థాయిలో అందడంలేదన్నారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతి పత్రంఇచ్చారు. సీపీఎం జిల్లా నాయకులు రాజశేఖర్, వెంకట రమణ, నాగేశ్వరరావు, దొంగబ్బాయి,చిన్నయ్య,సత్తిబాబు, చెల్లారావు పాల్గొన్నారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించాలి: కలెక్టర్



వృద్ధురాలితో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదులపరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను పారదర్శకతతో నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. వివిధ సమస్యలపై 480 అర్జీలను స్వీకరించారు. జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకట్రావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసు, ఎస్ఎస్ఏ పీవో వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 55 అర్జీలు

కాకినాడక్రైం,సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 55మందిఅర్జీదారులు ఎస్పీ బిందుమాధవ్ సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. ఈసందర్భంగా ఎస్పీ అర్జీదారుల సమక్షంలోనే పోలీస్‌అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ఫిర్యాదుదారులు పోలీస్‌స్టేషన్లలోను, సర్కిల్ కార్యాలయాల్లోను, సబ్‌డివిజన్ కార్యాలయాల్లోను ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆ ఫిర్యాదులను పోలీస్ గ్రీవెన్స్‌గానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేస్తారని ఎస్పీ స్పష్టం చేశారు.



గొల్లప్రోలులో యూరియా బస్తాలను ఇంటికి తీసుకెళ్తున్నరైతులు

ఫోకస్ అంతా యూరియా పైనే!

» సోమవారం కాకినాడకు వచ్చిన 575 మెట్రిక్ టన్నులు

» ఈనెలలో ఇంకా రానున్న 1,702 మెట్రిక్ టన్నులు

» టోకెన్ల విధానంలోనే పంపిణీ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో సీఎం దగ్గర నుంచి జిల్లాస్థాయిలో కలెక్టర్ వరకు అందరూ ఫోకస్ అంతా యూరియా నిల్వలు, సరఫరాపైనే దృష్టిని కేంద్రీకరించారు. ఏ రోజు ఎంత వరకు సరఫరా అవుతున్నదీ, దానిలో ఎంతవరకు పంపిణీ చేస్తున్నారనే అంశంపై ప్రత్యేకంగా నిఘాపెట్టారు. యూరియా ఎట్టిపరిస్థితిలో బ్లాక్ మార్కెటింగ్‌కు తరలించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 1,29,604 హెక్టార్లలో పంటలు సాగుచేశారు. దీనిలో వ్యవసాయ పంటలు 94,132 హెక్టార్లుకాగా, ఉద్యాన పంటలు 35,472 హెక్టార్లలో ఉన్నాయి. ఖరీఫ్ ఆరంభంలో జిల్లాలో సరిపడే ఎరువుల నిల్వలు ఉన్నప్పటికీ గతనెలలో కురిసిన భారీ వర్షాలవల్ల పంటలకు నష్టం జరిగింది. ఈనేపథ్యంలో ముంపునకు గురైన పంటలకు రైతులు పెద్దఎత్తున యూరియా చల్లుతున్నారు. దీంతో కొరత ప్రారంభమైంది. ఒకవైపు సాగు చేస్తున్న పంటలకు యూరియా కొనుగోలు చేస్తూనే ముంపునకు గురైన పంటలకు కూడా పెద్దఎత్తున యూరియా చల్లుతున్నారు. దీంతో యూరియా నిల్వలు తరిగిపోయాయి. తెలంగాణలోనిరామగుండంలో ఉన్న పరిశ్రమలో కొన్నికారణాలవల్ల యూరియా ఉత్పత్తి నిలిచిపోయింది. కాకినాడలో ఉన్న ఎన్‌ఎఫ్‌సీఎల్‌లో ఏడాదిగా ఉత్పత్తిని నిలుపుదల చేశారు. ఇలా అనేక కారణాల వల్ల రాష్ట్రంలో కొరత వచ్చింది. దీనివల్ల రైతులు యూరియా కోసం ఎరువుల దుకాణాలవద్ద పెద్దఎత్తున క్యూ కడుతున్నారు. ఈనెలలో జిల్లాకు యూరియా కేటాయింపులు పెంచి సరఫరా చేశారు. గత రెండురోజుల్లోనే 1200 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయింది. సోమవారం మరో 575 మెట్రిక్ టన్నులు వచ్చింది. దీనికి టోకెన్లు పంపిణీ చేశారు. మంగళవారం దీన్ని టోకెన్ల ప్రకారం పంపిణీ చేస్తారు. ఈనెలలో ఇంకా 1702 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సిఉంది. దీనికోసం జిల్లా అధికారులు ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేస్తున్నారు.గత ఐదేళ్లలో ఖరీఫ్ సీజన్‌లో వినియోగం పరిశీలిస్తే 2020లో జిల్లాలో 25,633 మెట్రిక్‌టన్నుల యూరియా వినియోగించారు. 2021లో 24,513 మెట్రిక్ టన్నులు, 2022లో 22,463 మెట్రిక్ టన్నులు, 2023లో 21,950 మెట్రిక్ టన్నులు, 2024లో 23,490 మెట్రిక్ టన్నులు వినియోగించారు. 2025 ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు 21వేల మెట్రిక్ టన్నులు జిల్లాకు వచ్చింది. ఇంకా 1702 మెట్రిక్ టన్నులు యూరియా రావాల్సి ఉంది. మరో 1600 మెట్రిక్ టన్నులు ప్రైవేటు డీలర్ల వద్ద ఉంది. ఈ సీజన్‌కు యూరియా సరిపోతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రతి రైతుకు యూరియా అందేలా చర్యలు తీసుకోవాలి

» వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు ఆదేశాలు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): యూరియా ప్రతి రైతుకు అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సోమవారం అమరావతి నుంచి సీఎం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలన్నారు. మితంగా వినియోగించే విధానాలపై వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన పెంచాలన్నారు. బ్లాక్ మార్కెటింగ్‌కు తరలిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమృద్ధిగా యూరియా ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదనిఅన్నారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ షాన్‌మోహన్, వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కొరత లేకుండా చర్యలు తీసుకున్నాం

» వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్

జిల్లాలో యూరియా కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. ఇప్పటివరకు విజిలెన్స్ బృందాలు జిల్లావ్యాప్తంగా 152ఎరువుల దుకాణాలను తనిఖీ చేశాయి. అవకతవకలకు పాల్పడిన ఏడు దుకాణాలపై 6ఏ కేసులు నమోదు చేశాం. రూ.36లక్షల89వేల విలువైన 170 మెట్రిక్ టన్నులు ఎరువులు స్వాధీనం చేసుకున్నాం. మరో మూడు ఎరువుల దుకాణాల్లో రూ.9.22లక్షల విలువైన ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేశాం. పెద్దాపురంలో ఇథనాల్ పరిశ్రమలను, ఆక్వాఫీల్డ్‌లను తనిఖీ చేశాం. జిల్లాలో ఎక్కడైనా ఎరువుల అక్రమ నిల్వలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చు.

చక్కనయ్యా.. చందమామ!



చందమామ మాయమైపోయాడు.. చక్కనయ్యా చందమామ ఎక్కడున్నావో అన్నా.. చందమామ రావె.. జాబిల్లి రావె.. అన్నా ఆదివారం రాత్రి కనిపించలేదు.. చంద్ర గ్రహణం కావడంతో మబ్బుల చాటున దాక్కున్నాడు.. చివరికి గ్రహణం విడుపు సమయం సోమవారం తెల్లవారు జామున ఇలా చందమామ బయటపడ్డాడు.. తొలుత అర్ధచంద్రా కారంలో కనిపించి మెల్లమెల్లగా తెల్లారేసరికి ఇలా చందమామ కనిపించాడు.. తెల్లవారుజామున నిండు చంద్రుడిని ఆనందంగా తిలకించారు.

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



నిండు గోదారి

ధవళేశ్వరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నిండుగా ప్రవహిస్తూనే ఉంది. గత 15 రోజులుగా గోదావరి వరద పెరిగింది. నిలకడగా కొనసాగుతుంది. సోమవారం సాయంత్రానికి ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ గేట్లను ఒక మీటరు మేర ఎత్తి 4,55,627 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 9.20 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాల నిమిత్తం డెల్టా కాలువకు 14 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 4900 క్యూసెక్కులు, సెంట్రల్ డెల్టాకు 2100 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 7 వేల క్యూసెక్కులు చొప్పున విడుదలవుతున్నాయి.భద్రాచలం వద్ద నీటిమట్టం 26 అడుగులుగా నమోదైంది.



వైరం మరచి..

కొత్తపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కలిసి ఉంటే కలదు సుఖం.. ఇది అక్షరాలా నిజం.. ఈ చిత్రమే అందుకు ఉదాహరణ. పిల్లి కుక్కకు ఎక్కడైనా పడుతుందా.. కనిపిస్తే చాలు కొట్టుకుంటాయ్.. అయితే ఈ చిత్రంలో చూడండి.. కుక్కపై పిల్లి ఎంత దర్జాగా పడుకుందో.. ఎందుకంటే జాతి వైరం మరచి స్నేహం చేస్తుంది. జాతివైరాన్ని మరిచి ఒక పిల్లి పిల్లను అక్కును చేర్చుకుంది శునకం.తన పొట్టపైనా పడుకున్నా ఏమనకుండా అలాగే ఉండిపోయింది. కొత్తపేట రామాలయం వీధిలో పిల్లి తల్లి రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది.ఆ పిల్లి పిల్లలు రోడ్డున పడ్డాయి.. నాటి నుంచి ఆ పిల్లి పిలల్లను ఆదరిస్తూ అక్కున చేర్చుకుంటుంది శునకం. ఎవరూ ఆ పిల్లి పిల్లల వద్దకు రాకుండా కాపాడుకుంటోంది. ఆ పిల్లి పిల్లలకు అమ్మగా మారిపోయింది..





అమలాపురంలో ప్రత్యేక కేంద్రం

ఆపరేషన్.. డాగ్స్!

కుక్కల నియంత్రణకో కేంద్రం

- కుక్కల నియంత్రణకు కోర్టు ఆదేశాలు
- వీధి కుక్కలకు కు.ని ఆపరేషన్లు
- అమలాపురంలో ప్రత్యేక భవనం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎటు చూసినా..ఎక్కడ చూసినా కుక్కల గుంపులే.. కొత్తగా ఏదైనా వీధిలో అడుగు పెట్టాలంటే ఏ కుక్క వచ్చి మీద పడుతుందోనని భయం.. అంతలా కుక్కల సంఖ్య పెరిగిపోయిం ది. అక్కడక్కడా దాడులు పెరిగాయి. ఏకంగా దేశ రాజధాని ఢిల్లీలో అయితే వరుసగా జరిగిన కుక్కల దాడులతో దేశ అత్యున్నత న్యాయస్థానం కల్పించుకుని తీర్పు చెప్పాల్సిన పరిస్థితి దాపురించింది. తొలుత ఢిల్లీకి మాత్రమే పరిమితమైన తీర్పును సవరణ చేస్తూ త్రిసభ్య ధర్మాసనం దేశ మంతటికీ వర్తించేలా ప్రకటించింది. కుక్కలన్నింటికీ స్టెరిలైజేషన్ (పిల్లలు పుట్టకుండా నియంత్రణ ఆపరేషన్లు) చేయించాలని పేర్కొంది. శస్త్రచికిత్స అనంతరం వాటిని ఎక్కడి నుంచి తీసుకువచ్చారో తిరిగి అక్కడే విడిచి పెట్టాలని ఆదేశించింది. రేబిస్ వ్యాధులు, విపరీత ప్రవర్తన ఉన్న కుక్కలను మాత్రం స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ అనంతరం ప్రత్యేక షెల్టర్లకు తరలించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నేపథ్యంలో అమలాపురం హిందూ శ్మశానాటిక సమీపంలో పశుజనన నియంత్రణ (ఏబీసీ), యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కేంద్రం(ఏఆర్వీ) ప్రత్యేకంగా నిర్మించారు.ఆ కేంద్రంలో ప్రత్యేక వైద్య నిపుణుల బృందం పర్యవేక్షణలో సిబ్బంది కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం ప్రారంభించారు. ప్రతీ కుక్కకు షెల్టర్లు నిర్మించి అందులోనే ఆహారం, నీరు అందిస్తున్నారు. వాటి ఆరోగ్యం కుదుట పడగానే తిరిగి ఎక్కడ నుంచి తెచ్చారో అక్కడే విడిచిపెడుతున్నామని మునిసిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు.

అమలాపురం పురపాలక సంఘంలో కుక్కల నియంత్రణకు సంబంధించి పశుజనన నియంత్రణ (ఏబీసీ) భవనాన్ని ప్రత్యేకంగా నిర్మించారు. ప్రత్యేక వైద్య సిబ్బందితో పాటు కమిషనర్ నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య బృందాన్ని నియమించారు. కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసుకున్నారు. ఏ రోజుకారోజు కుక్కలను పట్టుకుని పశుజనన నియంత్రణ కేంద్రానికి ఆ సిబ్బంది తరలిస్తారు. వైద్యులు ఆపరేషన్ చేయడంతో పాటు అవసరమైన కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందిస్తున్నారు.రెండు రోజులుగా 54 వీధికుక్కలకు పశుజనన నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించినట్టు కమిషనర్ నిర్మల్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం పట్టణంలో ఉన్న వీధి కుక్కలన్నింటికీ పశుజనన నియంత్రణ ఆపరేషన్లు చేసే దిశగా చర్యలు చేపట్టామని వివరించారు.

సుప్రీం తీర్పు..

సుప్రీం కోర్టు తీర్పును కొందరు సమర్థించగా మరికొందరు వ్యతిరేకించారు. పర్యావరణ సమతుల్యతను పరిగణలోనికి తీసుకోకుండా తీర్పు ఇస్తారా అని ప్రశ్నించినవారు ఉన్నారు. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరిగిన కుక్కల దాడుల ఘటనలను సోషల్ మీడియాలో విస్తృతంగా ఎందరో వైరల్ చేశారు. అటువంటి కుక్కలను తీసుకువెళ్లి నియంత్రణకు చేపట్టిన చర్యలను వ్యతిరేకించిన వారి ఇళ్ల వద్ద వదిలేయాలని పోస్టింగ్‌లు సైతం పెట్టారు.

రోడ్ల పక్కన ఆహారం నేరం



ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు వీధి కుక్కలకు బహిరంగ ప్రదేశాల్లో ఆహారం పెట్టడం నేరం. ఉల్లంఘించి ఆహారం పెడితే శిక్షణ తప్పదని సైతం హెచ్చరించారు. కుక్కలకు ఆహారం అందించడానికి ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వీధుల్లో కుక్కలకు అన్నం పెట్టినవారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వీధి కుక్కలను జంతు ప్రేమికులు దత్తత తీసుకోవచ్చునన్నారు.

వీధికుక్కల నియంత్రణకు చర్యలేవి?

వీధి కుక్కల నియంత్రణకు సంబంధించి గతంలోనే ప్రభుత్వాలు జీవోల ఇచ్చాయి. వాటిని అమలుచేసిన అధికారులు లేరు. పట్టించుకున్న పాలకులు లేరు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో కుక్కల బెడద విపరీతంగా పెరిగిపోయింది. గ్రామ సర్పంచ్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన కమిటీలు ఏమీ చేయకపోవడం వల్ల గ్రామాల్లో కుక్కల బెడద పెరిగిపోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీధికుక్కల నియంత్రణలో భాగంగా వాటిని పట్టుకోవడం, సురక్షిత పద్ధతుల్లో ఆపరేషన్లు చేయడం దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి ఎన్నో పనులు చేయాల్సిన కమిటీలు నేడు జాడ లేకుండా పోయాయి.

హిజ్రాలకు ఉచిత శిక్షణ



రాజమహేంద్రవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలు, నైపుణ్యాభివృద్ధిలో హిజ్రాలకు ఉచిత శిక్షణ అందించడానికి ట్వెంటీ ఫస్ట్ సెంచరీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ ముందుకు వచ్చిందని హిజ్రాలు, వయో వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహాయ సంచాలకులు శ్రీనివాస్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉద్యోగాలు సాధించడానికి, ఐటీ, ఐటీఈఎస్ రంగాల్లో ఉపాధి అవకాశాలకు శిక్షణ ఇవ్వడం ముఖ్యోద్దేశమన్నారు. తూర్పు, కాకినాడ, కోనసీమ జిల్లాల్లోని ఇంటర్, డిగ్రీ విద్యార్హత కలిగిన హిజ్రాలు తమ దరఖాస్తులను కాకినాడలోని తమ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరింత సమాచారం కోసం 0884-2352303 నెంబరులో పనివేళల్లో సంప్రదించాలని ఆయన సూచించారు.



యూరియా కావాలయ్యా!

అధికారులేమో యూరియా కొరత లేదంటారు.. రైతులు చూస్తే యూరియా కావాలంటూ క్యూలు కడతారు.. ఇచ్చింది చాలక మళ్లీ మళ్లీ కావాలంటున్నారు. గొల్లప్రోలులో సోమవారం రైతులు ఇలా బారులు తీరారు. - గొల్లప్రోలు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలిలో జగన్మోహినీకేశవస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



కాకినాడ జిల్లా సామర్లకోటలో ప్రత్యేక అలంకరణలో భీమేశ్వరస్వామి



కాకినాడ జిల్లా అన్నవరంలో ఆలయ సంప్రోక్షణ అనంతరం సత్యదేవుని దర్శించుకుని వస్తున్న భక్తులు

గ్రహణం వీడి... గుడులు తెరుచుకుని

- చంద్రగ్రహణం అనంతరం సంప్రోక్షణ చేసి ఆలయాలను తెరిచిన అర్చకులు
- స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు

సామర్లకోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వర ఆలయాన్ని చంద్ర గ్రహణం విడుపు అనంతరం సోమవారం ఉదయం తెరిచి సంప్రోక్షణ చేశారు. భీమేశ్వరస్వామికి పంచద్రవ్యాలతో అభిషేకం, స్వామివారికి, బాలాత్రిపురసుందరి అమ్మవార్లకు విశేష పుష్పార్చన చేసినట్టు ఈవో బళ్ళ నీలకంఠం తెలిపారు. సుమారు 1,500 మంది అన్నప్రసాదం స్వీకరించారు. పురాతన మాండవ్యనారాయణస్వామి ఆలయం, హరిహర క్షేత్రం, అన్నపూర్ణా సమేత రామలింగేశ్వరా లయంలో వ్యవస్థాపకుడు పరమానందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో ప్రధాన పండితుడు విశేష పూజలు చేశారు. గ్రహణం విడిచిన తర్వాత పట్టణంలోని అన్ని ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి.

అన్నవరం (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం మూతపడిన సత్యదేవుడి ఆలయం సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం తెరుచుకుంది. వేకువజామున మూడు గంటల నుంచి సిబ్బంది సంప్రోక్షణ చేపట్టారు. అనంతరం మూలవరులకు అర్చకస్వాములు ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం ఏడు గంటల నుంచి సర్వ దర్శనాలు ప్రారంభం కాగా భక్తులు స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు.

ఆత్రేయపురం (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, ర్యాలి జగన్మోహినీకేశవస్వామి ఆలయాలను చంద్ర గ్రహణం సంపూర్తి అనంతరం సోమవారం ఉదయం తెరిచారు. అర్చకులు సంప్రోక్షణ చేసి పూజలు జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



ప్రొఫెసర్ ఏఎస్ఎన్ చక్రవర్తికి ఉత్తమ అధ్యాపక అవార్డు అందజేసి సత్కరిస్తున్న జేఎన్టీయూకే ఉప కులపతి ప్రసాద్

అభ్యసనకు అంతులేదు : జేఎన్టీయూకే వీసీ ప్రసాద్

జేఎన్టీయూకే, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అభ్యసనకు అంతులేదని, నిబద్ధత, క్రమశిక్షణ, నిరంతరం శ్రమించేతత్వం అధ్యాపకులకు ఎంతో అవసరమని కాకినాడ జేఎన్టీయూ ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ పేర్కొన్నారు. వర్శిటీలోని యూసీఈకే సివిల్ ఇంజనీరింగ్ విభాగం సెమినార్ హాల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సోమవారం జేఎన్టీయూకే, యూసీఈకే అధ్యాపక సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ వి.శ్రీనివాసులు అధ్యక్షతన గురుపూజోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ ప్రసాద్, అతిథులుగా ప్రిన్సిపాల్ మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్స్ దీక్షితులు, స్వరూపారాణి హాజరై సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ అధ్యాపకులు ఎల్లప్పుడూ నైతిక విలువలు పాటిస్తూ సమాజ ఉన్నతికి తోడ్పడాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికైన ఏఎస్ఎన్ చక్రవర్తి, ఎస్.సత్యవేణి, కె.రవీంద్ర, డి.కోటేశ్వర రావు, బి.లీలాకుమారి, టి.లక్ష్మణకిషోర్‌లను వీసీ, అతిథులు సత్కరించారు. కార్యక్రమంలో జేఎన్టీయూకే డైరెక్టర్లు, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భీమేశ్వరుని సేవలో తెలంగాణ సీఎస్

ద్రాక్షారామ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామలోని భీమేశ్వరాలయానికి సోమవారం తెలంగాణ చీఫ్ సెక్రటరీ సోమేష్‌కుమార్ విచ్చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామిని, మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నంది మండపంలో వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. దాత మీనవల్లి వెంకటశ్రీనివాస్ ఉన్నారు.

భీమేశ్వరాలయానికి కోస్ట్‌గార్డ్ డీఐజీ రాజేష్‌మిట్టల్ విచ్చేశారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆయనకు నంది మండపంలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.



శిక్షణ తరగతుల ప్రారంభ సభలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ రమణ

'నూతన ఎంపీడీవోలు పరిపాలనాపరంగా మరింత నైపుణ్యం కలిగి ఉండాలి'

సామర్లకోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎంపికైన ఎంపీడీవోలు పరిపాలనాపరంగా మరింత నైపుణ్యం కలిగి ఉండాలని భావించి ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ పేర్కొన్నారు. నూతన ఎంపీడీవోలు 46 మందికి సోమవారం నుంచి నెల పాటు జరిగే శిక్షణ తరగతులు ఇక్కడ సోమవారం ప్రారంభమయ్యాయి. వీరికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు చెందిన కార్యక్రమాలు, గ్రామ పంచాయతీ, మండల పరిషత్ పరిపాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమగ్ర శిక్షణ ఇస్తారు. ముఖ్య అతిథిగా హాజరైన వైస్ ప్రిన్సిపాల్ రమణ మాట్లాడుతూ శిక్షణకు ముందు, శిక్షణ అనంతరం పరిపాలన నైపుణ్యాలను మరింత పెంచుకునేలా శ్రద్ధ, క్రమశిక్షణతో నేర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్‌రహిత స్టీలు మంచినీటి సీసాలను శిక్షణార్థులకు పంపిణీ చేశారు. డీడీవో శ్రీనివాసశర్మ, ఫ్యాకల్టీ జి.సుశీల, శేషుబాబు, చక్రపాణిరావు పలు అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణార్థులకు విస్తరణ శిక్షణ కేంద్రం ఆవరణలోనే రెసిడెన్షియల్ పద్ధతిలో వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నామని రమణ చెప్పారు.

కాంగ్రెస్‌తోనే భారత రాజ్యాంగ పరిరక్షణ

- ఎస్సీ వర్గీకరణను చంద్రబాబు వెనక్కి తీసుకోవాలి
- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

కాకినాడ సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే భారత రాజ్యాంగ పరిరక్షణ జరుగుతుందని సీడబ్ల్యూసీ సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ పేర్కొన్నారు. కాకినాడలోని ఓ హోటల్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం కాంగ్రెస్‌కు అండగా ఉన్న దళితులను విభజించేందుకు టీడీపీ ఆనాడే వ్యూహం పన్నిందన్నారు. కేసీఆర్ వెనుక మాదిగలు రాజ్యాధికారం దిశగా ఉండడంతో రాష్ట్ర విభజన జరిగిందన్నారు. ఇప్పుడు దళితుల మధ్య వివాదాలకు కారణమవుతున్న ఎస్సీ వర్గీకరణను చంద్రబాబు వెనక్కి తీసుకోవాలన్నారు. వైఎస్సార్ మరణం తర్వాత తెలంగాణకు చెందిన దామోదర రాజనరసింహకు సీఎం పదవి కట్టబెడితే ఆంధ్ర రాష్ట్ర విభజన జరిగేది కాదన్నారు. రాజ్యాంగ పరిరక్షణ దిశగా కుప్పం నుంచి దళితుల పాదయాత్ర జరుగుతోందన్నారు. ప్రధానిగా మోదీ 11 ఏళ్లుగా కొనసాగుతున్నారని, 2029 వరకు ఆ పదవిలో ఉంటారనే నమ్మకం తనకు లేదన్నారు. ఆయిల్ కొనుగోలులో మోదీ ప్రభుత్వం భారీ కుంభకోణానికి పాల్పడుతోందన్నారు. బ్యాంకుల నుంచి రూ.14.5 లక్షల కోట్ల రుణమాఫీ విషయంలో బీజేపీ తీవ్ర అవినీతికి పాల్పడిందన్నారు. రాష్ట్రంలో వాట్సాప్ పాలన కాకుండా వాటాల



పాలన సాగుతోందన్నారు. అమరావతిలో 70వేల ఎకరాలను రైతుల నుంచి బలవంతంగా సేకరించి పారిశ్రామికవేత్తలకు చౌకగా కట్టబెడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం కేవలం మోదీ, అమిత్‌షా భజన చేయడానికే పనిచేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో సానుభూతి పెరుగుతోందని, బయటకు వెళ్లిన నాయకులంతా తిరిగి వస్తారన్నారు.




శ్రీనివాస్‌కు పాదగయ క్షేత్ర ప్రాశస్త్యం వివరిస్తున్న వేద పండితుడు

పాదగయలో దక్షిణ మధ్య రైల్వే చీఫ్ వర్క్స్ మేనేజరు పూజలు

పిఠాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రానికి దక్షిణ మధ్య రైల్వే చీఫ్ వర్క్స్ మేనేజరు ఎస్.శ్రీనివాస్ సోమవారం విచ్చేశారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు క్షేత్ర ప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనం పలికారు. ఆలయ అధికారులు శ్రీనివాస్‌ను శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట సామర్లకోట రైల్వేస్టేషన్ మేనేజరు ఎం.రమేష్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్లు సీహెచ్ శ్రీనివాస్, ఎం.రవికృష్ణ వున్నారు.

ఆకాశం రంగుల మయం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం కొత్తూరు వద్ద సాయంత్రం ఆకాశం ఎరుపెక్కి ఇలా కనిపించింది. ఆలమూరు, ఆంధ్రజ్యోతి



యానాం గౌతమి గోదావరి నది ఒడ్డున సూర్యాస్తమయం వేళ ఆకాశం పసుపుమయమైంది. యానాం, ఆంధ్రజ్యోతి

లారీ డ్రైవర్‌పై దాడి నగదు దోపిడీ

దివాన్‌చెరువు హైవేపై ఘటన

దివాన్‌చెరువు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు పెట్రోలు బంకు వద్ద జాతీయ రహదారిపై గుర్తుతెలియని వ్యక్తులు లారీ డ్రైవర్‌ను కొట్టి నగదు దోచుకుపోయిన సంఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. రాజమహేంద్రవరం నుంచి సోలాపూర్ వెళ్తున్న లారీని డ్రైవర్ శ్రీషైన్‌మైత్రీ ఆదివారం అర్ధరాత్రి రెండుగంటల సమయంలో దివాన్‌చెరువు పెట్రోలు బంకు వద్ద రోడ్‌పక్కకు ఆపి డోర్ తెరచి క్యాబిన్‌లో పడుకున్నాడు. తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో బ్యాటరీ బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు నిద్రపోతున్న డ్రైవర్‌ను లేపి ఇష్టానుసారంగా కొట్టారు. అతడి జేబులో ఉన్న రూ.20 వేలు నగదుతో పాటు సెల్‌ఫోన్ తీసుకుని రాజానగరం వైపు పరారయ్యారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు బొమ్మూరు ఎస్‌ఐ ఆర్.అంకారావు తెలిపారు.

అర్ధరాత్రి హల్‌చల్...

మత్తులో పోలీసులపై యువకుల దాడి

రాజమహేంద్రవరంలో ఘటన



యువకుల దాడి దృశ్యాలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జనాన్ని రక్షించే పోలీసులకు రక్షణ లేకుండా పోయింది. అందుకు నిదర్శనం ఈ సంఘటనే. మత్తులో యువకులు పోలీసులపై దాడి చేశారు. అసలేం జరిగిందంటే.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ యు.నాగరాజు, హోంగార్డు కేకేకేఎస్‌వీ ప్రసాద్ (కాళి) ఆదివారం రాత్రి నైట్‌బీట్ పహారాలో ఉన్నారు. రాత్రి 12గంటల సమయంలో కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని సోనోవిజన్ సందులోకి వెళ్లగా.. అక్కడ ఓ చోట ముగ్గురు యువకులు పూటుగా తాగిన మత్తులో కనిపించారు. వాళ్లలో ఒక యువకుడు బీర్ తాగుతున్నాడు. దీంతో ఎవరు మీరు? ఇక్కడ ఈ టైంలో ఉండకూడదు? తాగేసి ఉన్నారు కదా? ఇళ్లకు వెళ్లిపోండి.. అని పోలీసులు అన్నారు. దీంతో ఆ యువకులు పోలీసులపై తిరగబడ్డారు. సుమారు 20 నిమిషాల పాటు కేకలు వేస్తూ, చేతులు విసురుతూ గలాటా సృష్టించారు. కాని స్టేబుల్ లాఠీని లాక్కున్ని కొట్టారు. యువకుల్లో ఒకడు తాను తాగే బీర్ బాటిల్‌తో తలపై కొట్టుకున్నాడు. చివరికి వాళ్లను అతికష్టంపై స్టేషన్‌కు తీసుకెళ్లారు. వాళ్లను పాత తుంగపాడుకు చెందిన కట్టుంగ హరీశ్, రాజవోలుకు చెందిన కర్రి దుర్గా సూర్య ప్రసన్న, ధవళేశ్వరం ఐవోసీఎల్ కాలనీకి చెందిన ములపర్తి వినోద్‌గా గుర్తించి కేసు నమోదు చేశారు. హరీశ్‌పై రాజా నగరం పోలీస్ స్టేషన్లో రౌడీ షీటు ఉంది. హత్య, హత్యాయత్నం నేరాల్లో నిందితుడిగా ఉన్నాడు. అయితే వారు గంజాయి పూటుగా తాగిన మత్తులో పోలీసులపై దాడికి దిగారని తెలుస్తోంది.

అనుమతి మేరకే పొగాకు పండించాలి

బాడవ పొలాల్లో పంట వేయొద్దు : పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

దేవరపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పొగాకు బోర్డు ఇచ్చిన అనుమతి మేరకే పొగాకు పండించాలని పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కుమార్ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో పొగాకు వేలం కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించి అనంతరం పొగాకు బోర్డు కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ రైతులు స్వీయ నియంత్రణ పాటించాలన్నారు. ఈ ఏడాది పొగాకు పంటకు ప్రారంభంలో ధర రూ.240 ఉండగా క్రమంగా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం కిలో ధర రూ.375 పలుకుతుందన్నారు. ఎన్‌ఎల్‌ఎస్ ఏరియాలో 42మిలియన్ కిలోల అనుమతి ఇవ్వగా అదనంగా 12మిలియన్ కిలోలు ఉత్పత్తి పెరిగిందన్నారు. అంతర్జాతీయంగా భారత దేశంలో పండించే పొగాకుకు గట్టి పోటీ ఉంటుందని ముఖ్యంగా జింబాబ్వే, బ్రెజిల్, ఆఫ్రికా వంటి దేశాల్లో పొగాకు ఉత్పత్తి పెరిగిందన్నారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని పంట నియంత్రణ పాటించాలన్నారు. గతేడాది తుఫాన్ వల్ల రైతులు తీవ్రంగా పంట నష్టపోవడంతో రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి, ఏలూరు ఎంపీ పి.మహేశ్ సహకారంతో పొగాకు అదనపు పంటకు పెనాల్టి లేకుండా వెసులుబాటు కల్పించిందన్నారు. ఈ ఏడాది అదనపు పంటకు పెనాల్టి 10-20శాతం వరకు ఉత్పత్తి అయిన పొగాకుకు 2-3శాతం పెనాల్టీ విధించినట్టు ఆయన తెలిపారు. తొర్రేడు రైతులు ఎన్‌ఎల్‌ఎస్‌కు బ్యారన్‌కు 35క్వింటాళ్ల అనుమతి ఇస్తున్నారని, తమకు 21 క్వింటాళ్లే అనుమతి ఇస్తున్నారని, అలాంటి వ్యత్యాసం లేకుండా చూడాలని చైర్మన్‌ను స్థానిక రైతులు కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి పొగాకు బోర్డు సమావేశంలో చర్చించి న్యాయం చేస్తామన్నారు. బాడవ పొలాల్లో పొగాకు పంట వేయొద్దని, అలా వేస్తే బోర్డు చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు కొత్తగా బ్యారన్ లైసెన్సులు ఇవ్వాలని కోరగా ఈ విషయం తన పరిధిలో లేదని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ జీఆర్‌కే ప్రసాద్, దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి హేమస్మిత, పొగాకు బోర్డు రైతు సంఘం నాయకులు కరుటూరి శ్రీనివాస్, కేవీవీ సత్యనారాయణ, పరిమి శ్రీరామకృష్ణ, యాగంటి వెంకటేశ్వరరావు, సింహాద్రి ధర్మవతారం, నరహరశెట్టి రాజేంద్రబాబు, బిక్కిన నాగరాజు, నాయుడుదుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

స్కానింగ్ సెంటర్ సీజ్

పూర్తి విచారణ చేపట్టాలి : కాకినాడ కలెక్టర్

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఓ స్కానింగ్ సెంటర్‌ను కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సోమవారం సీజ్ చేశారు. కాకినాడలోని వెంకటేశ్వర స్కానింగ్ సెంటర్‌లో పీసీపీఎండ్‌డీటి యాక్ట్‌కు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించట్లేదన్న ఆరోపణలపై విచారణ చేపట్టిన డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ బృందం ఆ నివేదికను కలెక్టర్ షాన్‌మోహన్‌కు సమర్పించింది. దాంతో ఆయన ఆదేశానుసారం ఆర్డీవో ఎస్.మల్లిబాబు సమక్షంలో స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేశారు. ఈ స్కానింగ్ సెంటర్‌ను 8 వారాలు సస్పెన్షన్ చేస్తూ ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో పూర్తి విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని స్కానింగ్ సెంటర్ల యాజమాన్యం పీసీపీఎండ్‌డీటి యాక్ట్ ప్రకారం నమోదు చేసుకోకపోయినా, సరైన రికార్డులు నిర్వహించకపోయినా, ఫారం ఎఫ్ రిపోర్ట్‌లు డీఎంహెచ్‌వో కి పంపక సోయినా, లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఆడ, మగ అని తెలిపినా పీసీపీఎండ్‌డీటి యాక్ట్ నిబంధనలు అతిక్రమణగా పరిగణించి తగు చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో నరసింహనాయక్ తెలిపారు.

భర్తను హత్య చేసిన భార్య అరెస్ట్

అమలాపురం రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భర్తను అతి కిరాతకంగా ఇనుపరాడ్‌తో తలపై మోది హత్య చేసిన భార్య దొమ్మేటి వెంకటరమణను సోమవారం అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచినట్టు తాలూకా ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ నడిపూడి బైపాస్ రోడ్డులో మెట్ల రాంజీ కాలనీలో ఈనెల 4న అర్ధరాత్రి సమయంలో కాకినాడ హెడ్ క్వార్టర్స్ స్క్వాడ్‌లో ఆర్టీసీ బస్సుల తనిఖీ అధికారిగా పనిచేస్తున్న దొమ్మేటి రాంబాబు (61)ని కిరాతకంగా భార్య వెంకటరమణ హత్య చేసింది. దొమ్మేటి నాగసురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. భార్య వెంకటరమణను అరెస్టు చేసి సోమవారం రాత్రి కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మరణించిన సూర్యప్రకాష్

గొల్లప్రోలు, సెప్టెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణ శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణించాడు. పట్టణానికి చెందిన సందిపు సూర్యప్రకాష్ (39) తన స్కూటీపై కాకినాడ బయలుదేరాడు. పట్టణ శివారులోని వెంకటేశ్వర రైస్‌మిల్లు వద్దకు వచ్చేసరికి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మరణించాడు. గొల్లప్రోలు ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఆటో ఢీకొని మహిళ మృతి

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మరణించింది. గ్రామానికి చెందిన ముల్లుల్లి శేషారత్నం (60) రోడ్డు దాటుతుండగా కాకినాడ నుంచి పిఠాపురం వస్తున్న ఆటో ఢీకొని అక్కడిక్కడే మరణించింది. పిఠాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొల్లప్రోలులో కూలిన ఇంటి పైకప్పు

తప్పిన ప్రమాదం

గొల్లప్రోలు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలులో ఇంటి పైకప్పు కూలిన సంఘటనలో పెను ప్రమాదం తప్పింది. పట్టణంలోని మార్కండేయపురానికి చెందిన రాపర్తి గనిరాజుకు చెందిన పెంకుటిల్లు పైకప్పు ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి నానిపోయింది. సోమవారం అకస్మాత్తుగా కూలిపోయింది. ఆ సమయంలో ఆ ప్రాంతంలో కుటుంబసభ్యులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇంట్లో సామాన్లు పూర్తిగా పాడయ్యాయని గనిరాజు తెలిపాడు.

ఇదేం వైద్యం?

ఆసుపత్రి ముందు బాధితుల ఆందోళన

కొత్తపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఉప్పాడ తీర ప్రాంతంలో ప్రవేటు ఆసుపత్రికి సోమవారం మాయాపట్నంకు చెందిన శాంతిరాజు, పాత పంచాయతీ సమీపంలో నివాసం ఉండే వి వీరకమల్ వేర్వేరు ఇబ్బందులతో వైద్యం చేయించుకోవడానికి వెళ్లారు. వారికి రక్తపరీక్షలు చేయించారు. శాంతి రాజుకు మలేరియా పాజిటివ్, వీరకమల్‌కు మలేరియా పాజిటివ్, పచ్చకామెర్లని రిపోర్టు ఇచ్చారు. ఐదు రోజుల పాటు ఆసుపత్రిలో ఉండి చికిత్స పొందాలని, లేకుంటే చాలా ప్రమాదమని చెప్పడంతో హడలెత్తిపోయారు. వారిద్దరూ వేరే ఆసుపత్రికి వెళ్లగా రక్తపరీక్షలు చేసి వైరల్ జ్వరాలని, మందులు వాడితే సరిపోతుందని వైద్యులు తెలియజేశారు. దీంతో శాంతిరాజు, వీరకమల్ ముందు పరీక్షలు చేయించిన ఆసుపత్రికి చేరుకుని ఆందోళన చేపట్టారు. వైద్యుడిని గట్టిగా నిలదీశారు. తీరప్రాంతాల్లో ప్రవేటు ఆసుపత్రులు, రక్తపరీక్ష కేంద్రాలపై అధికారులు విచారణ నిర్వహించి చర్యలు చేపట్టాలని కోరారు.

ఆటోలు, బస్సుల్లో మహిళలే టార్గెట్

● చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి మహిళల అరెస్ట్ ● రూ.2 లక్షల నగదు, 106.5 గ్రాముల బంగారం స్వాధీనం



అన్నవరంలో వివరాలు వెల్లడిస్తున్న ప్రత్తిపాడు సీఐ

అన్నవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆటోలు, బస్సుల్లో ప్రయాణించే మహిళలే వారి టార్గెట్. వారితో ప్రయాణిస్తూ మాటలతో ఒకరు దృష్టి మరల్చుతారు మరొకరు చాకచాక్యంగా బ్యాగుల్లో విలువైన వస్తువులు, నగదు తస్కరిస్తారు. అలా చోరీలు చేస్తున్న ఇద్దరు మహిళలు అన్నవరం పోలీసులకు చిక్కారు. వివరాల్లోకి వెళితే తూర్పుగోదావరి జిల్లా గోకవరానికి చెందిన తొండ శాంతి (35), ఆవుల భూలక్ష్మి (38) తోడుదొంగలు. మహిళా ప్రయాణికులే టార్గెట్‌గా అన్నవరం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలు చేశారు. 4 కేసుల్లో నిందితులుగా ఉన్న వారి కోసం పోలీసులు 3 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయగా అన్నవరం ఎస్‌ఐ హరిబాబుకు వచ్చిన సమాచారం మేరకు వారిని శంఖవరం కత్తిపూడిలో పట్టుకున్నట్టు ప్రత్తిపాడు సీఐ సూర్యఅప్పారావు తెలిపారు. వారి నుంచి రూ.2 లక్షల నగదు, 106.5 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన నేపథ్యంలో మహిళలు ప్రయాణంలో అప్రమత్తతో ఉండాలని కోరారు.

కొత్తకోటపాడులో ప్రబలిన డయేరియా



గ్రామంలో బాధితుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

- నాలుగు కేసుల నమోదు
- వినాయకచవితి ప్రసాదంతో ఫుడ్ పాయిజనింగ్ : అధికారులు
- నియంత్రణలో పరిస్థితి : డీఎంఅండ్‌హెచ్‌వో

రంగంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం కొత్త కోటపాడులో నాలుగు డయేరియా కేసులు నమోదు కావడంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సోమవారం డయేరియా కేసులు నమోదు కావడంతో విషయాన్ని డీఎంఅండ్‌హెచ్‌వోకి తెలియజేయడంతో వెంటనే డిప్యూటీ డీఎంహెచ్‌వో, జిల్లా సర్వేలెన్స్ అధికారి, ఎపిడెమియాలజిస్ట్, జిల్లా బృందం, ఫుడ్ ఇన్స్‌పెక్టర్ కొత్త కోటపాడు వచ్చి నమోదైన డయేరియా కేసులను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారు. రంగంపేట పీహెచ్‌సీ, ప్రత్యేక డాక్టర్ల బృందంతో మెడికల్ క్యాంప్ నిర్వహించి బాధితులకు చికిత్స అందించారు. ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, పర్యవేక్షక సిబ్బంది ఇళ్ల దగ్గరకు వెళ్లి కేసులపై విచారణ జరిపారు. అలాగే నీటి, మల నమూనాలను సేకరించి పరిశీలన కొనసాగుతుంది. పరిస్థితి నియంత్రణలో ఉందని డీఎం అండ్‌హెచ్‌వో కె.వెంకటేశ్వరరావు తెలిపారు. వినాయక చవితి ప్రసాదం పులిహోర తినడంతో అది ఫుడ్‌పాయిజనింగ్ కారణంగానే డయేరియా వచ్చి ఉండవచ్చని వైద్యాధికారులు తెలిపారు. ఇదే నిజమైతే డయేరియా కేసులు ఇంకా పెరగొచ్చని గ్రామస్తులు భావిస్తున్నారు. అలాగే కొత్తకోటపాడు, పాత కోటపాడు గ్రామస్తులు కొత్త నాయకంపల్లిలో ఉన్న నూతినీటిని తాగుతారని తెలపడంతో ఆ నీటి నమూనాలను కూడా సేకరించారని తెలిపారు. గ్రామంలో కేసులు నమోదైన ఇళ్ల దగ్గర పరిసరాల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ప్రజలకు డయేరియాపై ఆరోగ్య విద్యా కార్యక్రమం నిర్వహించారు. నాయకంపల్లిలో ఉన్న నుయ్యి కూడా అపరిశుభ్రంగా ఉందని కొందరు గ్రామస్తులు చెప్తున్నారు.

కాకినాడలో కారు బీభత్సం

అదుపు తప్పి దూసుకెళ్లడంతో ఇద్దరికి గాయాలు



దెబ్బతిన్న కారు

కాకినాడ క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో సోమవారం ఓ కారు బీభత్సం సృష్టించింది. వివరాలిలా ఉన్నాయి. మురళీ అనే వ్యక్తికి సంబంధించిన కొత్త కారు స్థానిక ప్రతాప్‌నగర్ బిడ్జి నుంచి గాంధీనగర్ వైపు వస్తూ ఉండగా ప్రమాదవశాత్తు అదుపు తప్పింది. ఈ క్రమంలో రోడ్డుపక్కన ఉన్న చిన్న చిన్న షాపులు, పార్క్ చేసి ఉన్న ద్విచక్రవాహనాలపైకి దూసుకెళ్లింది. దీంతో రోడ్డు పక్కన వ్యాపారం చేస్తున్న తోపుడు బండ్ల సామానులన్ని చెల్లచెదురయ్యాయి. అదేవిధంగా అదే ప్రాంతానికి చెందిన పాలకూరి శ్రీనివాసరావు అనే 71 ఏళ్ల వృద్ధుడు, కడలి వెంకటనారాయణ గాయాల పాలయ్యారు. అది గమనించిన స్థానికులు క్షతగాత్రులను జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతున్నారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి కిడ్నాప్?

కత్తులతో బెదిరించి కారులో తీసుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు



మతిస్థిమితం లేని వృద్ధురాలు (ఫైల్)

చింతూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వృద్ధురాలిని గుర్తుతెలియని వ్యక్తులు కారులో తీసుకెళ్లిపోయారు. అల్లూరి జిల్లా చింతూరుతో పాటు సమీప గ్రామాల్లో 12 ఏళ్లుగా ఓ వృద్ధురాలు సంచరిస్తూ జీవనం గడుపుతోంది. ఆకలి అవుతున్నపుడు హోటళ్ల వద్దకు వెళ్తుంటుంది. వారు ఓ ముద్ద అన్నం పెడుతుంటారు. కాగా ఇటీవల ఆమె చింతూరుకు పది కిలోమీటర్ల దూరంలో ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న తుమ్మల వెళ్లింది. ఆదివారం రాత్రి కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి వృద్ధురాలిని బంధించి తీసుకెళ్లినట్టు గ్రామస్తులు పేర్కొన్నారు. బంధించి కారులో ఎక్కిస్తుండగా అడ్డుకునే ప్రయత్నం చేశామని, కానీ ఆ గుర్తుతెలియని వ్యక్తులు తమను కత్తులతో బెదిరించడంతో చేసేదేమీ లేక మిన్నకుండి పోయామని వారు చెప్పారు.

రంపచోడవరం నూతన ఐటీడీఏ పీవో బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు మొక్క అందజేస్తున్న ఐటీడీఏ పీవో

రంపచోడవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఐటీడీఏ నూతన ప్రాజెక్టు అధికారి స్మరణ్‌రాజ్ సోమవారం ఏఎస్‌ఆర్ జిల్లా కేంద్రం పాడేరులో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఐటీడీఏ పీవోగా బాధ్యతలు నిర్వహించిన కట్టా సింహాచలం రిలీవ్ అయ్యారు. కాగా నూతన ఐటీడీఏ పీవో స్మరణరాజ్ సోమవారం పాడేరులో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన పీవో స్మరణ్‌రాజ్ అక్కడే ఐటీడీఏ పీవో బాధ్యతలు స్వీకరించినట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. కాగా ఢిల్లీలో జరగనున్న రెండు రోజులు కాన్ఫరెన్స్‌కు నూతన పీవో బయలుదేరి వెళ్లినట్టు సమాచారం. మరో మూడు రోజుల తర్వాత నూతన పీవో రంపచోడవరం వస్తారని అధికారులు తెలిపారు.

ఉపాధ్యాయుడి అదృశ్యంపై ఫిర్యాదు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం వడ్డిగూడెంలో వైదాని వెంకటరమణప్రసాద్ (52) కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. ముమ్మిడివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకటరమణప్రసాద్ ఈ నెల 6వ తేదీ ఉదయం ఇంటిన ఉంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. రెండు రోజుల పాటు ప్రసాద్ ఆచూకీ కోసం స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ప్రయోజనం లేదు. దాంతో సోమవారం ఉపాధ్యాయుడు ప్రసాద్ భార్య నాగవెంకటవిజయలక్ష్మి అమలాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కిశోర్‌బాబు తెలిపారు.

విధుల్లో స్పృహ తప్పిన హెడ్ కానిస్టేబుల్

కైకలూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా కైకలూరులో జరుగుతున్న అల్లర్ల నేపథ్యంలో బందోబస్తు నిర్వహించేందుకు వచ్చిన పోలీసు అనారోగ్యానికి గురయ్యాడు. సోమవారం కైకలూరు కరకట్ట వద్ద కాకినాడ 3వ బెటాలియన్‌కు చెందిన ఏపీఎస్పీ హెడ్ కానిస్టేబుల్ డి.అశోక్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నాడు. సాయంత్రం 4 గంటల సమయంలో ఆకస్మికంగా స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో స్థానిక పోలీసులు హుటాహుటిన కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు.



కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌కుమార్

రేపు సుందరయ్య భవన్‌లో కవి సమ్మేళనం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12వ తేదీన కమ్యూనిస్టు నేత సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా బుధవారం సాయంత్రం 5.30 గంటలకు సుందరయ్య భవన్‌లో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు తెలిపారు. 'సీతారాం ఏచూరి-సమమాజ ఆలోచన' అంశంపై జరిగే కవి సమ్మేళనానికి ఆసక్తి గల సాహితీ ప్రియులంతా హాజరుకావాలని ఓ ప్రకటనలో కోరారు.



కాకినాడలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న జేసీ రాహుల్‌మీనా, డీఎంహెచ్‌వో నాయక్

ఫిజియోథెరపీ ఒక ప్రముఖ వైద్య ప్రక్రియ: జేసీ

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైద్య చికిత్సా విధానంలో ఫిజియోథెరపీ ప్రముఖ ప్రక్రియ అని జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా పేర్కొన్నారు. ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ జీజీహెచ్ ఫిజియోథెరపీ విభాగం, జిల్లా వైద్య-ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం సర్పవరం కూడలి వద్ద అవగాహన ర్యాలీని జేసీ రాహుల్‌మీనా, డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ జెండా ఊపి ప్రారంభించారు. జేసీ మాట్లాడుతూ మనిషి దృఢంగా ఉండాలంటే కండరాలు మరింత దృఢంగా ఉండాలన్నారు. ర్యాలీలో పాల్గొన్న వారికి జీజీహెచ్ ఫిజియోథెరపీ విభాగాధిపతి డాక్టర్ ఎల్.సాయినాథ్ ఆధ్వర్యంలో ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం జీజీహెచ్ ఫిజియోథెరపీ విభాగంలో జరిగిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, డాక్టర్ ఉమాశంకర్ మొహంతిలను ఘనంగా సత్కరించారు. ఫిజియోథెరపీ, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.


పది, ఇంటర్‌లో ప్రతిభ చూపిన వారికి స్కాలర్‌షిప్‌లు అందించిన జేసీఐ అధ్యక్షురాలు డాక్టర్ తన్మయి

17 మంది విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ ఏపీఎస్పీ హైస్కూల్లో పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన 17 మంది విద్యార్థులకు కాకినాడ పోర్టుకు చెందిన జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) రూ.51వేలు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందించారు. సోమవారం హైస్కూల్ ఆవరణలో ప్రధానోపాధ్యాయిని కె.గాయత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.3వేలను జేసీఐ అధ్యక్షురాలు డాక్టర్ తన్మయి పంపిణీ చేశారు. హెచ్ఎం గాయత్రి, హైస్కూల్ ప్లస్ ఇన్‌చార్జి కందుకూరి పాల్‌రాజులను ఆమె అభినందించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో డాక్టర్ తన్మయిని ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు చామంతి నాగేశ్వరరావు, నాగార్జున, మూర్తి, కృష్ణవేణి, విజయలక్ష్మి, రామలక్ష్మి, ప్రకాశ్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.


రాజారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీ స్రవంతి సభ్యులు

'ప్రజా కళల వారధి రాజారావు'

పెద్దాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజానాట్యమండలి వ్యవస్థాపకుడు, ప్రజా కళాకారుడు గరికపాటి రాజారావు ఆదర్శనీయుడని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్దామని సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షుడు చల్లా విశ్వనాథం పిలుపునిచ్చారు. డాక్టర్ రాజారావు 62వ వర్ధంతి సభ యాసలపు సూర్యారావు భవనంలో సీనియర్ కళాకారుడు దారపురెడ్డి సత్యనారాయణ అధ్యక్షతన ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. తొలుత రాజారావు చిత్రపటానికి జానపద కళాకారుడు కుంచే అచ్చారావు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం విశ్వనాథం మాట్లాడుతూ వృత్తిరీత్యా డాక్టర్ అయిన రాజారావు సామాజిక రుగ్మతలపై కళారూపాల ద్వారా రోగం నయం చేయడానికి ప్రయత్నం చేశారన్నారు. ప్రజానాట్య మండలి కార్యదర్శి రొంగల వీర్రాజు, దారపురెడ్డి కృష్ణ, మహపాతిన రాంబాబు, సిరపురపు బంగార్రాజు, భజన కళాకారుల సంఘం నాయకులు నీలం శ్రీను, ఎస్.శ్రీనివాస్, గూనూరు రమణ, ఎస్.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.


పాదగయలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకస్వాములు

పాదగయకు పోటెత్తిన భక్తులు

పిఠాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం అనంతరం సోమవారం ఉదయమే భక్తులు అధికంగా తరలివచ్చి పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహుతికా అమ్మవార్లను దర్శించుకున్నారు. కుక్కుటేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులతో పాదగయ పరిసరాలు కిటకిటలాడాయి. ఈవో శ్రీనివాస్ అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.



కాకినాడలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కాకినాడ చేరుకున్న రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం, మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కుప్పంలో చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర సోమవారం కాకినాడ చేరుకుంది. ఉమ్మడి జిల్లా మాల మహానాడు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పండు అశోక్‌కుమార్, తుళ్ళిబిల్లి అశోక్‌కుమార్, డాక్టర్ చెన్నకేశవులు మాట్లాడుతూ తప్పుడు లెక్కలతో ఎస్సీ వర్గీకరణను రాజ్యాంగ విరుద్ధంగా చేసినందుకు ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. యాత్రలో రాష్ట్ర కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, మూలే మేఘరాజు, లింగం శివ, బుంగ సతీష్, జల్లి శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, మురారి రవికుమార్, సాధనాల రాజు, బత్తుల రాంజీకుమార్, దడాల బుజ్జిబాబు, మెండి డేవిడ్ అంబేడ్కర్, సాపే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్షర జ్ఞానంతో వెలుగులు నింపాలి

వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ పోశయ్య


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ పోశయ్య

పిఠాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమకున్న అక్షరజ్ఞానాన్ని నలుగురికీ పంచి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ పసుపులేటి పోశయ్య కోరారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానికి అనుగుణంగా చదవడం ద్వారా ఉన్నత స్థానాలకు ఎదగవచ్చని చెప్పారు. విద్యార్థినులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వవికాసం పుస్తకాలతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రిన్సిపాల్ సుజాత, సోషల్ యాక్టివిస్టు వాసు, అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ వాసంశెట్టి త్రిమూర్తులు, గణాంక సహాయకులు వి.ఆనంద్‌బాబు, పి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



కొత్త కాలనీకి వెళ్లే బ్రిడ్జి వద్ద నిర్మించిన ప్రత్యామ్నాయ రహదారి కొంత మేర కొట్టుకుపోయి ప్రవహిస్తున్న సుద్దగడ్డ వరద నీరు, నిచ్చెన ఎక్కి బ్రిడ్జిపై నుంచి రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

పెరుగుతున్న సుద్దగడ్డ వరద

గొల్లప్రోలు శివారు కొత్త కాలనీ రహదారికి గండి
నిచ్చెన ఆధారంగానే స్థానికుల రాకపోకలు

గొల్లప్రోలు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లోను, స్థానికంగా కురిసిన వర్షాలతో సుద్దగడ్డలో వరద నీటి ప్రవాహం పెరుగుతోంది. గొల్లప్రోలు పట్టణ శివారు కొత్త కాలనీకి వెళ్లే మార్గంలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యామ్నాయ రహదారిపై వరద నీరు ప్రవహించడంతో కొంత మేర కొట్టుకుపోయి గండి పడింది. దీంతో కాలనీకి రాకపోకలు నిలిచిపోయాయి. విద్యార్థులు, పట్టణంలో వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారు నిచ్చెన ఎక్కి బ్రిడ్జి దాటి అవతల వైపునకు చేరుకుంటున్నారు. నీటి ప్రవాహ ఉధృతి అధికంగా ఉండడంతో గత వరదలకు దెబ్బతిన్న ఈ రోడ్డుపై వేసిన గ్రావెల్ కొట్టుకుపోయింది. కాలనీ వాసులకు కష్టాలు తప్పట్లేదు.

అలయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం


ప్రమాణస్వీకారం అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ శ్రీ పద్మారామ్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం కాస్మోపాలిటన్ క్లబ్ సమావేశ హాలులో సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా తెలగాని వీరభద్రరావు, కార్యదర్శిగా కాకరపల్లి శ్రీనివాసరావు, కోశాధికారిగా ఎస్.కృష్ణవేణి, పీఆర్వోగా కొమ్మన తాతారావు, సభ్యులు ప్రమాణం చేశారు. పూర్వ అధ్యక్షుడు పెంకే శివకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని అంతర్జాతీయ అలయన్స్ క్లబ్స్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు.

అనంతరం ఆయనతో పాటు ముఖ్య అతిథిగా విచ్చేసిన అలయన్స్ క్లబ్స్ జిల్లా గవర్నర్ పెంకే గోవిందరాజు, పూర్వ అధ్యక్షుడు బి.తిరుపతిరాజు మాట్లాడుతూ గ్రామాల్లో అలయన్స్ సేవలను విస్తరించాలన్నారు. కార్యక్రమంలో సౌత్‌ఇండియా మల్టిపుల్ కౌన్సిల్ కోశాధికారి వనం శ్రీనివాసరావు, పూర్వ గవర్నర్ మునిరెడ్డి పద్మావతి, ఉప గవర్నర్ కేవీవీ సత్యనారాయణ, మల్టిపుల్ క్లబ్ కో-ఆర్డినేటర్ సతీష్, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ కోశాధికారి కిరణ్ కుమార్, సీహెచ్‌వీ వరప్రసాద్, బీఎస్‌వీ ప్రసాద్, తెలగాని వెంకట్రావు, వికాస్ శ్రీరాములు, వనం ఎ.ఉపేంద్రనాథ్, సరళకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు

కాకినాడ నగరపాలక సంస్థ కమిషనరు భావన



కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను వెంటనే పరిష్కారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనరు భావన ఆదేశించారు. సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన 'డయల్ యువర్ కమిషనరు'కు ఆరుగురు ఫోనులో తమ సమస్యలను కమిషనరు దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో కమిషనరు భావనకు 21 పైగా సమస్యలతో కూడిన అర్జీలను ప్రజలు అందజేశారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఆదేశించారు. ఎస్ఈ పి.వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజరు సీతారాం, టీపీఆర్వో శైలజ, అకౌంటెంట్ రామశాస్త్రి, ఉద్యానవన శాఖ ఏడీ సిరిల్, ఏఈలు పాల్గొన్నారు.

మోతాదుకు మించిన యూరియాతో పంటకు ముప్పు : ఏవో సత్య

కరప, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మోతాదుకు మించిన యూరియా వినియోగంతో చీడపీడలు ఆశించి పంటకు ముప్పు వాటిల్లుతుందని కరప మండల వ్యవసాయాధికారిణి ఇమ్మిడిశెట్టి సత్య పేర్కొన్నారు. వేములవాడ సొసైటీలో యూరియా అమ్మకాలను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన యూరియా ఔట్ రీచ్ కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ మండలవ్యాప్తంగా ఎక్కడా యూరియా కొరత లేదన్నారు. రైతు సేవా కేంద్రాలు, సొసైటీలు, ప్రైవేట్ దుకాణాల ద్వారా విక్రయిస్తున్న యూరియా పక్కదారి పట్టకుండా గ్రామగ్రామాన యూరియా టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటుచేశామని వివరించారు. సొసైటీ చైర్మన్ దూడల నారాయుడు, సీఈవో నల్లా వెంకటేశ్వరరావు, జనసేన నాయకుడు మీసాల రాంబాబు, వ్యవసాయ విస్తరణాధికారి ఎంపీ సతీష్, ఏఈవో జె.సతీష్ పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు: రైతులకు తప్పని కష్టాలు

గొల్లప్రోలు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. ప్రైవేటు షాపుల వద్ద బారులు తీరారు. గొల్లప్రోలు పట్టణంతో పాటు తాటిపర్తి గ్రామానికి చెందిన ప్రైవేటు డీలర్లుకు సోమవారం 62.5 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. విషయం తెలియడంతో రైతులు గొల్లప్రోలులోని రెండు షాపుల వద్దకు భారీగా తరలివచ్చారు. ఒక్కొక్కరికి రెండు బస్తాలు వంతున యూరియా అందించారు. ఈ సమయంలో రైతుల మధ్య వాగ్వాదాలు, తోపులాటలు జరిగాయి. మన గ్రోమోర్ దుకాణం వద్ద రైతులు ఎండలోనే గంటల తరబడి యూరియా కోసం ఎదురుచూడాల్సి వచ్చింది.

సామర్లకోట మండలానికి 60 మెట్రిక్ టన్నుల యూరియా

సామర్లకోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖరీఫ్ సాగుకు అవసరమైన 60 మెట్రిక్ టన్నుల యూరియాను పీఏసీఎస్‌ల్లో అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయాధికారి మురళీధర్ సోమవారం సాయంత్రం తెలిపారు. సామర్లకోట పీఏసీఎస్‌కు 20 మెట్రిక్ టన్నులు, వెంకటకృష్ణరాయపురానికి 20 మెట్రిక్ టన్నులు, అచ్చంపేటకు 10 మెట్రిక్ టన్నులు, రావువారిచంద్రంపాలేనికి 10 మెట్రిక్ టన్నుల చొప్పున సిద్ధం చేసి రైతులకు టోకెన్లు సరఫరా చేసినట్టు ఆయన చెప్పారు. మండలంలో యూరియా స్టాక్ పాయింట్లను కాకినాడ ఏడీఏ దుర్గాలక్ష్మి పరిశీలించి వ్యవసాయ సిబ్బందికి తగు సూచనలు చేశారు.

కొత్తపల్లి మండలానికి 40 మెట్రిక్ టన్నులు

కొత్తపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలానికి 40 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయాధికారి వట్టి జోగిరాజు తెలిపారు. కొత్తపల్లికి 20 మెట్రిక్ టన్నులు, యండపల్లికి 20 మెట్రిక్ టన్నుల బస్తాలను ఆయా గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు చేపట్టినట్టు వివరించారు.

11న జాబ్‌మేళా

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, పేటీఎంల్లో పనిచేయుటకు కాకినాడ జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 11వ తేదీ ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఆసక్తి గల పురుషులు, మహిళలు తమ సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్స్ కాపీలతో జిల్లా ఉపాధి కార్యాలయానికి హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 8639846568 నెంబరును సంప్రదించాలని కోరారు.

13న బాలురు అండర్-14 క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి బాలురు అండర్-14 క్రికెట్ క్రీడాకారుల ఎంపికలను ఈ నెల 13వ తేదీన కాకినాడ రంగరాయ వైద్య కళాశాల క్రికెట్ మైదానంలో ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి నక్కా వెంకటేష్ తెలిపారు. 2011 సెప్టెంబరు ఒకటో తేదీ తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. ఎంపికకు హాజరయ్యే బాలురు తప్పనిసరిగా స్కూల్ డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ పత్రాలు తీసుకురావాలని... తెల్ల దుస్తులు, తెల్ల బూట్లు ధరించి క్రికెట్ కిట్టుతో హాజరుకావాలని కోరారు.



పాదగయ క్షేత్రంలో భవానీ మాలధారణ

పిఠాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో సోమవారం భవానీ మాలధారణ జరిగింది. భక్తులు పుష్కరిణిలో స్నానాలు ఆచరించి కుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో కొలువైన రాజరాజేశ్వరీదేవి, దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవతైన పురుహుతికా అమ్మవార్ల సమక్షంలో భవానీ దీక్ష స్వీకరించారు. వీరికి ఆలయ పురోహితులు మాలధారణ చేశారు. ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పీజీఆర్ఎస్‌కు 21 అర్జీలు

పిఠాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 21 అర్జీలు అందాయి. ఏపీడీ వసంతమాధవి, మునిసిపల్ కమిషనరు నామ కనకారావు, తహసీల్దారు పీవీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ప్రజలు తమ అర్జీల నమోదు, పరిష్కారం, వాటి స్థితిగతుల గురించి 1100కి ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఏపీడీ చెప్పారు.

రొయ్యు రైతులపై 50శాతం పన్ను తగ్గించాలి

కొత్తపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆక్వా రైతులపై విధించిన 50శాతం పన్ను తగ్గించాలని కాకినాడ జిల్లా రైతు సంఘ నాయకుడు గురాల అప్పారెడ్డి డిమాండ్ చేశారు. ఈ నెల 11న విజయవాడలో జరిగే ఆక్వా రైతుల రాష్ట్ర సదస్సుకు అధిక సంఖ్యలో ఆక్వా రైతులు తరలిరావాలని కోరారు. సోమవారం ఆయన నాగులాపల్లిలో పర్యటించి రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు.

ఇన్‌చార్జి ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండల ప్రజా పరిషత్ డిప్యూటీ ఎంపీడీవో కాశీ విశ్వనాథ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు సామర్లకోట ఈటీసీలో నెల పాటు రెసిడెన్షియల్ ఫౌండేషన్ ఎంపీడీవోల శిక్షణల్లో పాల్గొనేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలివ్వడంతో కాశీ విశ్వనాథ్ బాధ్యతలు చేపట్టారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

విష జ్వరాల విజృంభణ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

మోతుగూడెం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):మోతుగూడెం మన్యంలో ఇటీవల కురిసిన వర్షాలతో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వర పీడితులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు చింతూరు ప్రాంతీయ ఆసుపత్రి కిటకిటలాడుతోంది. వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం పూర్తిగా లోపించడంతో దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయి. పీహెచ్‌సీల్లో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చింతూరు ఏరియా ఆసుపత్రికి సిఫార్సు చేస్తున్నారు. ఆస్పత్రుల్లో దగ్గు, జలుబుతో పాటు జ్వరాల కేసులు అధికంగా నమోదవుతున్నాయి. సాధారణంగా మోతుగూడెం పీహెచ్‌సీ ప్రతి రోజూ 50 నుంచి 60వరకు ఓపీ నమోదవుతుంది. ప్రస్తుతం 100మంది వరకూ రోగులు వస్తున్నారు. వీరిలో 40కుపైగా జ్వర బాధితులే ఉంటున్నారు. కొందరికి మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు నిర్ధారణ అవుతున్నాయి.

స్మార్ట్‌రేషన్‌కార్డుతో సకాలంలో నిత్యావసరాల పంపిణీ



రంపచోడవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా సకాలంలో లబ్ధిదారులకు నిత్యావసరాలు, రేషన్ బియ్యం ప్రభుత్వం పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డివిజన్ పరిధిలో అడ్డతీగల 11,148, దేవీపట్నం 9,057, గంగవరం 8,067, మారేడుమిల్లి 5,446, రాజవొమ్మంగి, రంపచోడవరం 10,396, వై.రామవరం8,182, చింతూరు డివిజన్‌పరిధిలో చింతూరు 11,629, కూనవరం8,236, వీఆర్‌పురం 8,101,ఎటపాక 13,741 స్మార్ట్ రేషన్‌కార్డులు ఆయా సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తారన్నారు. ఎస్టీకమిటీ సభ్యురాలు గొర్లె సునీత, ఎంపీపీ బంధం శ్రీదేవి, జడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్‌ఎంపీపీ కె.బాలకృష్ణ, సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, తహసీల్దారు బాలాజీ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై ఏఎస్పీ విచారణ

ఎటపాక, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దళితుడైన పశువుల కాపరిని కులం పేరుతో దూషిస్తూ కర్రతో దాడి చేసిన ఘటనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై చింతూరు ఏఎస్పీ పంకజ్‌కమార్ మీనా సోమవారం గౌరిదేవిపేట గ్రామంలో విచారణ నిర్వహించారు. గౌరిదేవిపేటకు చెందిన జంగాల సాయిబాబు తన గేదె, లేగదూడ తొలుకెళ్లే విషయంలో జరిగిన వివాదంలో పశువుల కాపరి గవ్వల వెంకటేష్‌పై సాయిబాబు కర్రతో దాడి చేసిన విషయం తెలిసిందే. సోమవారం ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా బాధితుడిని దాడి జరిగిన ప్రాంతం వద్దకు తీసుకెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలువురు ప్రత్యక్ష సాక్షులను విచారించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసుపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. ఏఎస్పీ వెంట సీఐ ఎం.కన్నపరాజు, ఎస్‌ఐ అప్పలరాజు, వీఆర్వో సావిత్రి ఉన్నారు.

ఎంపీపీ స్కూల్‌ను తక్షణమే ప్రారంభించాలి

దేవీపట్నం, సెప్టెంబర్8(ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌ఆర్ కాలనీపెద్ద భీంపల్లి-2 పెనికిలపాడు గ్రామంలో ఉన్న ఎంపీపీ పాఠశాలకు తక్షణమే ఉపాధ్యాయులను నియమించి పాఠశాలను ప్రారంభించాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా శేఖర్ మాట్లాడుతూ పెనికిలపాడులో ఎంపీపీ పాఠశాల భవనం నిర్మించి ఐదేళ్లు కావస్తున్నా నేటికి ఉపాధ్యాయులను నియమించి పాఠశాలను ప్రారంభించలేదన్నారు. ఆదివాసీ సంక్షేమపరిషత్ రాష్ట్ర ప్రచారకార్యదర్శి సోడే మురళి మాట్లాడుతూ రంపచోడవరం, దేవీపట్నం, గంగవరం మండలాల్లో కోయ భాష మాట్లాడే విద్యార్థులకోసం ప్రాథమిక దశ నుంచి కోయ భాష పరిరక్షణ కోసం ప్రభుత్వం వలంటీర్లను నియమించాలన్నారు. ఆదివాసీజేఏసీ రాష్ట్ర కార్య దర్శి కారం రామన్నదొర, మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే

మారేడుమిల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషాదేవి విజయభాస్కర్ సోమవారం పరామర్శించారు. గొందివాడ గ్రామానికి చెందిన దివ్యతేజ మారేడుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతూ ఇటీవల గాయపడి మృతిచెందిన విషయం తెలిసిందే. ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే సోమవారం క్యాంప్ కార్యాలయంలో కలుసుకుని మాట్లాడారు. తన వంతు సహాయంగా రూ.25వేలు అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తెలుగుయువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, ఎస్టీకమిటీ మెంబర్ గొర్లె దెబోరా సునీత, పార్టీ మండల అధ్యక్షుడు గురుకు శేషు కుమార్, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు మళ్ళ దుర్గాప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

చింతూరులో డీడీవో కార్యాలయం ఏర్పాటు

డీడీవోగా విజయకుమార్ నియామకం

చింతూరు, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి):చింతూరు డీడీవో (డివిజనల్ డెవలప్‌మెంట్‌అధికారి)గా మేకల విజయకుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజయకుమార్ విశాఖపట్నం నుంచి బదిలీపై ఇక్కడకు రానున్నారు. పది రోజుల్లో ఆయనబాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు చింతూరు డివిజన్‌స్థాయి పంచాయతీరాజ్ పాలనా వ్యవహారాలను రంపచోడవరం డీడీవో, డీఎల్‌పీవోలు పర్యవేక్షించారు. విలీన మండలాలకు ప్రత్యేకంగా రెవెన్యూడివిజన్ చింతూరులో ఏర్పాటైనక్రమంలో పాలనా వ్యవహారాలను చింతూరు కేంద్రంగా నిర్వర్తించాల్సి ఉందని ప్రభుత్వం భావించింది. చింతూరులో డీడీవో కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో డీడీవోను నియమించారు. త్వరలో డీఎల్‌పీవో పోస్టు కూడా భర్తీ చేసే అవకాశం ఉంది. తాత్కాలిక డీడీవో కార్యాలయం కోసం చింతూరు సచివాలయం కోసం నిర్మించిన భవనాన్ని కేటాయించారు. అదనపు వసతులు కోసం కాకినాడ జిల్లా పంచాయతీరాజ్ నుంచి రూ.15 లక్షలు కేటాయించారు. పదిరోజుల్లో డీడీవో కార్యాలయం నుంచి పాలన ప్రారంభంకానుంది. డివిజన్‌లోని డీఎల్‌పీవో, ఎంపీడీవో, సచివాలయం, ఏపీడీ వెలుగు, ఏపీడీ ఎన్ఆర్‌జీఎస్ తదితరశాఖలు డీడీవో పర్యవేక్షణలో పని చేయనున్నాయి.

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 71 అర్జీలు

రంపచోడవరం, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి):ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 71అర్జీలు ఐటీడీఏ ఏపీవో(జీ) డీఎన్వీ రమణ స్వీకరించారు. డీ పట్టా భూములకు అటవీ శాఖాధికారుల వేధింపులు ఆపాలని, పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ అధికంగా అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేడ్కర్, డిప్యూటీ డైరెక్టర్లు రుక్మాండయ్య, షరీఫ్, డీఎల్‌డీవో కె.కోటేశ్వరరావు, పీహెచ్‌వో దేవదానం, అధికారులు పాల్గొన్నారు.

మూడు ర్యాపిడ్ బృందాల ఏర్పాటు

రాజవొమ్మంగి సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాల్లో రెండు నెలలుగా ప్రజలు అనారోగ్యంతో మంచంపట్టిన విషయం తెలిసిందే. అయితే దీనిపై సోమవారం ఆ గ్రామాల్లో అధికారులు మెడికల్ క్యాంపులు నిర్వహించారు. ఏడీఎంహెచ్‌వో డేవిడ్ గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మూడు ర్యాపిడ్ టీమ్స్ ఏర్పాటు చేసామని, సిబ్బంది గ్రామాల్లో తిరిగి ప్రజల వద్ద నుంచి బ్లడ్ శాంపిల్స్ సేకరిస్తారన్నారు.

పెదమల్లాపురాన్ని మండల కేంద్రంగా చేయాలి

కలెక్టర్‌కు సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజన సంఘం నాయకుల వినతి

ప్రత్తిపాడు/శంఖవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 59 సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాలను పెదమల్లాపురం కేంద్రంగా నూతన మండలాన్ని ఏర్పాటు చేయాలని సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజన సంఘ నాయకులు మునలయ్య, బూరిసి బాలరాజు తదితర నాయకులు కలెక్టర్ షన్‌మోహన్‌కు విజ్ఞప్తి చేశారు.



సోమవారం వారు కాకినాడ తరలివెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశా రు. సబ్‌ప్లాన్ ఏజెన్సీలోని 59 గిరిజన గ్రామాలు అనేక మార్లు కాకినాడ జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి విచ్చేసి తమ సమస్యల గోడు వెళ్లతీసుకున్నట్లు చెప్పారు. పెదమల్లాపురం కేంద్రంగా వెంటనే సబ్‌ప్లాన్ ఏజెన్సీ మండలాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాన్ని రంపచోడవరం ఐటీడీఏలో విలీనం చేయాలని వారు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజన నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి అందజేస్తున్న సబ్‌ప్లాన్ సంఘ నాయకులు

అన్న క్యాంటీన్‌లో అన్నదానం



పేదలకు భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

జగ్గంపేట సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రోడ్‌లో ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో సోమవారం మామిళ్లపల్లి అయ్యప్ప, మౌనికల ఆర్థిక సహాయంతో పేదలకు అన్నదానం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు జీను మణిబాబు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దేవరపల్లి మూర్తి, బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వేములకొండ జోగారావు, ప్రధాన కార్యదర్శి సోమసుందరం, కార్యదర్శి రవి, జిల్లా విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు మండపాక అప్పన్న దొర, టీడీపీ పట్టణాధ్యక్షుడు పాండ్రకి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సీడీపీవో పూర్ణిమ, తల్లులు

జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజపూడి అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ జగ్గంపేట సీడీపీవో పూర్ణిమ ఆధ్వర్యంలో పోషకాహార దినోత్సవం నిర్వహించారు. తల్లులు పోషక విలువలుతో కూడిన పిండి వంటలు, ఇళ్ల వద్ద తయారు చేసి తీసుకుని వచ్చారు. వారిలో ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు అందించారు. సర్పంచ్ భూసాల విష్ణు, పంచాయతీ సెక్రటరీ నరసింహామూర్తి, సూపర్‌వైజర్ అమ్మాజీ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

రౌతులపూడి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి ఎమ్మార్సీ నందు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు గోడి ప్రసన్న, యర్రా శ్రీనువాసు, మండల ఉత్తమ ఉపాధ్యాయులు ఊమా మహేశ్వరి. ఎల్.రమణబాబు, జి.సీతాకుమారి. ఇ.దేవరాజు, బి.లక్ష్మణరావు, కోరుప్రోలు చిట్టిబాబులను యుటీఎఫ్ మండల శాఖ సన్మానించింది. ఎంఈవోలు కే.సతీష్, జి.కొండబాబు, కోళ్ల రాంబాబు, పి.రాంబాబు, పివి.శివగిరి డి.మల్లేశ్వరి తదితరులు ఉన్నారు.



విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారుల తనిఖీ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం, ఏలూరులో ఎరువులు, పురుగుమందుల షాపుల దుకాణాలు, గోదాములను విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ధర్మవరం ఎరువుల షాపులో రూ.3 లక్షల విలువైన ఎరువులు అమ్మకాల నిలుపదలకు ఆదేశాలు ఇచ్చారు. ఏలూరులో విఘ్నేశ్వర ఎరువుల షాపులు రూ.8.15లక్షల ఎరువుల ఇపాస్ మిషన్‌లో వ్యత్యాసం ఉండంతో 6ఏ కేసు నమోదు చేశారు. అలాగే మండలంలో 80టన్నుల యూరియా ఎరువును ఏలూరు, రాయవరం, రాచపల్లి, ఒమ్మంగి, చింతలూరు, యుజే జగన్నాథపురం గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలు ద్వారా రైతులకు పంపిణీ చేశారు. గజ్జెనపూడిలో 20 టన్నులు, ఏలూరులో 20 టన్నులు, ప్రత్తిపాడులో మన గ్రోమోర్‌లో 20 టన్నుల వంతున ప్రైవేట్ షాపుల్లో 140 టన్నుల యూరియా అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయాధికారి జోకా అమృత తెలిపారు. ధర్మవరం, ఏలూరు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ తనిఖీల్లో సీఐ ఐ.గోపాలకృష్ణ, తహశీల్దార్ కె.విజయ్‌కుమార్, కానిస్టేబుల్ వీవీఎస్ లోవరాజు పాల్గొన్నారు.



ఏలూరులో ఎరువుల గోదామును తనిఖీ చేస్తున్న అమృత, విజిలెన్స్ శాఖ సిబ్బంది

‘రోడ్డుపై చెత్త వేస్తే చర్యలు తప్పవు’

కిర్లంపూడి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై చెత్త వేస్తే చర్యలు తప్పవని బూరుగుపూడి పంచాయితీ కార్యదర్శి నూకరాజు సిబ్బందికి పేర్కొన్నారు. బూరుగుపూడి గ్రామపంచాయితీలో ప్రతిరోజు క్లాప్ మిత్రాల ద్వారా ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్త సేకరణ చేస్తున్నారు. కూరగాయల వ్యాపారులు బూరుగుపూడి గ్రామ శివారులో రోడ్డుపక్కన చెత్త వేయడంతో వాటిని పంచాయితీ కార్యదర్శి నూకరాజు, అధికారులు పరిశీలించారు. ఇకపై రోడ్డుపక్కన చెత్త వేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే కాకినాడ నుంచి డీపీఆర్‌సీ బృందం సభ్యులు సందర్శించారు. బూరుగుపూడిలో శిక్షణ ఇస్తున్న క్లాప్ మిత్రలకు పలు సూచనలు చేశారు.



రోడ్డుపై చెత్తను పరిశీలిస్తున్న అధికారులు

గిరిజన సంఘం ప్రదర్శన

ప్రత్తిపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో ఆంధ్రప్రదేశ్ గిరిన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు, సంఘ కార్యకర్తలు సోమవారం ప్రదర్శన నిర్వహించారు. స్థానిక లిబరేషన్ పార్టీ కార్యాలయం నుంచి అల్లూరి సీతారామరాజు సెంటర్ వరకు కొనసాగింది. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకారులు ధర్నా నిర్వహించి డిప్యూటీ తహశీల్దార్ కె.పుణ్యవతికి వినతిపత్రం అందజేశారు. ఆందోళనకు నాయకత్వం వహించిన రాష్ట్ర గిరిజన సంఘ అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం మాట్లాడుతూ మండలంలోని పొదురుపాక గిరిజనలో ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములను స్వాధీనానికి భూ స్వాములు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. గిరిజనులు, గిరిజన భూముల రక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. మానుకొండ లచ్చబాబు, ఇరటాకృష్ణ, నాగసూరి, పీసమ్మ, అడ్డాల వెంకట్రావు, శివ, రాజబాబు, నారాయణరావు,గడ్డియ్య, గణేష్, బాపూజీ తదితరులు ఉన్నారు.

అరుణాచలేశ్వరునికి విశిష్ట పూజలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి అడ్డురోడ్డు వద్ద గల అరుణాచలేశ్వర ఆలయంలో సోమవారం వేకువ జాము నుంచి గ్రహణానంతర పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు రమణానంద స్వామి ఆధ్వర్యంలో ఆలయంలోని నాయినార్లు, అపీత కుంచాంబ అరుణాచలేశ్వర స్వామి, కాళ భైరవ తదితర దేవతామూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రత్తిపాడు, కిర్లంపూడి, ఏలేశ్వరం మండలాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులు అన్నప్రసాద వితరణ చేశారు.

ఏపీ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యుడిగా శివ



ప్రత్తిపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కత్తిపూడికి చెందిన వెన్న ఈశ్వరుడు (శివ) ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యుడిగా నియమితులయ్యారు. సోమవారం సాయంత్రం ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్న వెన్న శివకు ఈ పదవి లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ శివను అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం

జగ్గంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా జగ్గంపేట హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో ఏఎంటి ఫిజియోథెరపీ క్లినిక్ నందు డాక్టర్ శ్రీరామ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాసరావు, జనసేన మండల ఉపా ధ్యక్షులు అచ్చే వీరబాబు తదితరులు ఉన్నారు.

తుమ్మలపల్లి పరామర్శ

జగ్గంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం కాండ్రేగులకి చెందిన పాలిసెట్టి నాగేశ్వరరావు ఇటీవలే ఆపరేషన్ చేయించుకోవడంతో జనసేన పార్టీ జగ్గంపేట ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు. జనసేన నాయకులు గంధం శ్రీను, పాఠంశెట్టి రమేష్,కురుమళ్ళ నాగేశ్వరరావు ఉన్నారు.

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ



రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

గండేపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బయ్యమ్మపేటలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ బొండా శ్రీనుబాబు, గొల్లమిల్లి అప్పలరాజు, మార్కెటింగ్ డైరెక్టర్ సింగులూరి రామదీప్, గొల్లవిల్లి రాజు, అప్పన్న శ్రీనివాసరావు, రేషన్ డీలర్ పొడి శీను పాల్గొన్నారు.

అక్షర ఆంధ్రపై అవగాహన

జగ్గంపేట సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం ఉమా మహేశ్వరరావు ఆధ్వర్యంలో ఉల్లాస్ అక్షర ఆంధ్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడల్ట్ ఎడ్యుకేషన్ జిల్లా యాంకర్ పర్సన్ రాజేష్ రాజేష్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఎంఈవో స్వామి, వెలుగుకార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

‘ఆదిత్య’లో వర్క్‌షాప్

గండేపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ మెకానిక్ ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం విద్యార్థుల కోసం చెన్నై ఎల్‌అండ్ టి ఎడ్యూటెక్‌కు చెందిన డాక్టర్. మహేష కులకర్ణి పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ అన్ ఇండస్ట్రియల్ కాంటెక్స్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించినట్టు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డా.మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలియజేసారు. పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ ప్రాధాన్యత, పరిశ్రమల్లో దీని అన్వయాన్ని వివరించారు. ఆధునిక విద్యుత్ ఉత్పత్తి వ్యవస్థలో ఉపయోగించే సాంకేతికతను విద్యార్థులకు తెలియజేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే దివ్య



దొండవాకలో వృద్ధురాలి నుంచి అర్జీని స్వీకరిస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

తునిరూరల్, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. దొండబాక గ్రామంలో మండల స్థాయి వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజా దర్బార్‌కు అర్జీదారులు పోటెత్తి వైసీపీ పాలనలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఆ పార్టీ నాయకులు అవినీతి అక్రమాలతో తీవ్రంగా నష్టపోయామంటూ మహిళలు వాపోయారు. నిరుపేద కుటుంబాలకు కేటాయించిన ఇళ్ల స్థలాలు అమ్మకుని సొమ్ము చేసుకున్నారని వైసీపీ నాయకులపై గ్రామస్తులు ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంలో న్యాయం చేయాలని ఎమ్మెల్యేను గ్రామస్తులు కోరారు. అనంతరం ఎమ్మెల్యేకు గ్రామస్తులు వివిధ సమస్యలపై అర్జీలు అందించారు. స్థానిక రెవెన్యూ సిబ్బందిపై పలువురు ఫిర్యాదులు చేశారు. రెవెన్యూ అధికారుల తీరు మారకుంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ యువనాయకుడు యనమల రాజేష్, టీడీపీ మండల అధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు గంట్ల చిట్టిబాబు డాక్టర్ గంటల చిన్నారావు గంటల సత్యనారాయణ, తమరాన సత్యనారాయణ, తమరాన రామకృష్ణ, ఎంపీడీవో సాయి, నవీన్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

రైతులు సాంకేతికతను అందిపుచ్చుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తిమ్మాపురం గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేసే దిశగా ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వ సబ్సిడీపై డ్రోన్ యంత్రాలను రైతులకు అందజేశారు. తిమ్మాపురం మాజీ సర్పంచ్ కాపారపు అబ్బులు, అత్తి అచ్చుతరావు, పాల్పాటీ కృష్ణ, ఎడ్ల అప్పారావు, గజ్జి రంబాబు, ఆవుగడ్డి వెంకటరమణ, వ్యవసాయ శాఖాధికారులు అశోక్ కుమార్ ఉన్నారు.


లయన్స్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

తునిరూరల్, సెప్టెంబర్8(ఆంధ్రజ్యోతి):తుని మెయిన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ విజయవంతంగా జరిగింది. జాతీయ నేత్రదాన పక్షోత్సాన్ని పురస్కరించుకుని తుని పట్టణ పురవీధుల్లో నేత్రదానంపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు, లయన్స్ క్లబ్ సభ్యులు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ గురు ప్రసాద్, ఆర్ఆర్ నేత్రాలయ డాక్టర్ భగవాన్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో భారీ వర్షం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో సోమవారం సాయంత్రం మండలంలో భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో వర్షం పడింది.వరుసుగా 4 రోజుల నుంచి వర్షాలు కురుస్తుండంతో మండలంలోని చెరువులు, కాలువలకు పెద్ద ఎత్తున వర్షపునీరు తరలివస్తుంది. పల్లపు ప్రాంతాలు జలమయంగా మారాయి. ఖరీఫ్ వ్యవసాయ పనులకు ఈ వర్షాలు ఎంతో ప్రయోజనక రం అవుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆరోగ్య కేంద్రం పరిశీలన



తొండంగి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర బృందం సోమవారం ఏవీ నగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. డాక్టర్ అరుణ, డాక్టర్ మౌనికలు ఆసుపత్రిలో అమలు జరుగుతోన్న స్వచ్ఛత కార్యక్రమాల అమలును పరిశీలించారు. బయోమెడికల్ వేస్టేజ్ డిస్పోజల్, పారిశుధ్యం, ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. డాక్టర్ రవికుమార్, డాక్టర్ భారతి నుంచి పలు వివరాలు సేకరించారు. ఆసుపత్రిలో పారిశుధ్యం అమలు జరుగుతోన్న తీరును పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు వారు తెలిపారు.